RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

CITIZEN TIMES TELUGU DAILY



VOLUME: 17 | ISSUE: 275 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 30-4-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక : 275 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 30-4-2026 | పేజీలు : 8 | రూ: 2/-

## యూపీ అభివృద్ధికి కొత్త జీవనాడి..

రూ. 36,230 కోట్లతో గంగా ఎక్స్‌ప్రెస్‌వే.. జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

ఉత్తరప్రదేశ్‌లో గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించిన ప్రధాని మోదీ

రూ. 36,230 కోట్ల వ్యయంతో 594 కిలోమీటర్ల పొడవున 6 లేన్ల రహదారి నిర్మాణం

మీరట్–ప్రయాగ్‌రాజ్ మధ్య ప్రయాణ సమయం 12 గంటల నుంచి 6 గంటలకు తగ్గింపు

షాజహాన్‌పూర్ జిల్లాలో 3.5 కిలోమీటర్ల ఎమర్జెన్సీ ల్యాండింగ్ స్ట్రిప్ ఏర్పాటు



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి కొత్త జీవనాడిలా మారే గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. హర్దోయ్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో, సుమారు రూ. 36,230 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రతిష్ఠా త్మక ప్రాజెక్టును ఆయన జాతికి అంకితం

తరువాయి 2లో..

## శభాష్... లోకేశ్ వర్కింగ్ స్టయిల్ ను అభినందించిన సీఎం చంద్రబాబు

టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేశ్

లోకేశ్‌ను అభినందించి, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన చంద్రబాబు

సీనియర్లు, జూనియర్ల కలయికతో నూతన కమిటీల కూర్పు

ప్రతిపక్షంపై తీవ్ర విమర్శలు,

క్రమశిక్షణతో మెలగాలని నేతలకు సూచన

రాష్ట్ర పునర్నిర్మాణం, సంక్షేమం,

అభివృద్ధిపై దృష్టి సారించామని వెల్లడి



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

తెలుగుదేశం పార్టీలో నూతనోత్సాహం నింపుతూ, భవిష్యత్ కార్యాచరణకు స్పష్టమైన సంకేతాలిస్తూ పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, లోకేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "శభాష్ లోకేశ్" అంటూ ఆయన పనితీరును కొనియాడారు. కేవలం పర్మిషన్లతో కాదని, పనితోనే పదవులు వస్తాయని నిరూపించారని ప్రశంసించారు. బుధవారం మంగళగిరి లోని టీడీపీ కేంద్ర

తరువాయి 2లో..

## ఏపీ టెన్త్ ఫలితాలు నేడే..

ఫలితాలను ప్రకటించనున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

అధికారిక వెబ్‌సైట్, వాట్సాప్, యాప్ ద్వారా ఫలితాలు తెలుసుకునే అవకాశం

ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా పరీక్షలు రాసిన 6.30 లక్షల మంది విద్యార్థులు

తరువాయి 2లో..



## ఇంధనాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు

ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్

స్టాక్ ఉంచుకుని 'నో స్టాక్' బోర్డులు పెట్టే బంకులపై కఠిన చర్యలకు మంత్రి ఆదేశాలు

ఆక్వా, వరి రైతులకు ఇంధన కొరత రాకుండా చూడాలన్న మంత్రి

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశాలు

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఇంధనాన్ని పక్కదారి పట్టిస్తూ, కృత్రిమ కొరత సృష్టించే వారిపై ఉక్కు పాదం మోపాలని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత, అక్రమాలపై మంత్రి నాదెండ్ల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అక్రమాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని హెచ్చరించారు. ఈ

తరువాయి 2లో..






## ఫొటో పెట్టి మరీ ట్రంప్ వార్నింగ్

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేశారు. అణు కార్యక్రమానికి సంబంధించి దౌత్యపరమైన పరిష్కారం త్వరలో లభించకుంటే అమెరికా కఠిన వైఖరి తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఇరాన్ తెలివిగా వ్యవహరిస్తే మంచిదన్నారు. ఈ మేరకు రైఫిల్ పట్టుకున్న ఫొటోను 'ట్రూత్ సోషల్'లో పోస్టు చేసిన ట్రంప్.. ఇక మీదట తాను మంచివాడిగా ఉండనని పేర్కొన్నారు. "చర్చల విషయంలో ఇరాన్ సరిగ్గా వ్యవహరించలేకపోతోంది. అణు ఒప్పందం ఎలా చేసుకోవాలో వారికి తెలియడం లేదు. వారు తెలివిగా వ్యవహరిస్తే మంచిది. 'ఇక మీదట అంత మంచివాడిగా ఉండను' అని ట్రంప్ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడం, అమెరికా–ఇరాన్‌ల మధ్య దౌత్యపరమైన ప్రతిష్టంభన నెలకొన్న వేళ ట్రంప్ నుంచి ఈ ప్రకటన వెలువడింది. అంతేకాదు, అమెరికా ప్రతిపాదనలు తిరస్కరిస్తే తాము మరింత దూకుడుగా, కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరికలు చేస్తున్నారు.




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

చమురు ఎగుమతి దేశాల సమాఖ్య అయిన ఒపెక్, ఒపెక్‌ం నుంచి నిష్క్రమించనున్నట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రకటించడం చర్చనీయాంశం అయ్యింది. దీనివల్ల ప్రపంచ ఆయిల్ మార్కెట్‌పై ఎలాంటి ప్రభావం ఉండబోతోందన్న దానిపై ఆసక్తి నెలకొంది. అయితే, ఒకరకంగా భారత్‌కు కలిసొచ్చే అంశమని అదానీ గ్రీన్ ఎనర్జీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాగర్ అదానీ అన్నారు. దిల్లీలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఒపెక్ నుంచి యూఏఈ వైదొలగడం వల్ల అంతర్జాతీయ మార్కెట్‌పై ప్రభావం గురించి ఇప్పుడే ఓ అంచనాకు రాలేమని సాగర్ అదానీ అన్నారు. ప్రపంచ ఆయిల్ మార్కెట్ ఒడుదొడుకులు ఎదుర్కొంటుందా? స్థిరత్వం సాధిస్తుందా? అనే దానికి కాలమే సమాధానం చెప్తుందన్నారు. అదే సమయంలో యూఏఈతో భారత్‌కు ఉన్న మంచి సంబంధాల దృష్ట్యా మనకు లాభించే అవకాశం ఉందన్నారు. భారత్ కోణంలో చూస్తే ఈ పరిణామం వల్ల మేలు జరుగుతుందని, ప్రపంచ మార్కెట్ కోణంలో చూడాల్సివస్తే ఇప్పుడే తుది నిర్ణయానికి

తరువాయి 2లో..

## పవన్ కల్యాణ్‌తో నేను బాగానే ఉన్నా.. అతిగా ప్రవర్తిస్తే సహించేదిలేదు

## టీడీపీ నేతలకు చంద్రబాబు వార్నింగ్

అధికారం ఉందని ఇగోలకు పోవద్దు..

సొంత పార్టీ నేతలకు చంద్రబాబు హెచ్చరిక

సొంత బాబాయిని చంపి నెపం

మనపై నెట్టారని వైసీపీపై తీవ్ర విమర్శలు

జనసేన, బీజేపీతో సమన్వయం అవసరం..

కేంద్రంతో గ్యాప్ రాకూడదని స్పష్టీకరణ

ఫ్లెక్సీలు, కుర్చీల కోసం

గొడవలు పడొద్దని కార్యకర్తలకు హితవు

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం

కావాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు సొంత పార్టీ నేతలకు, కార్యకర్తలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అధికారం వచ్చిందన్న అహంతో ఎవరూ ఇగోలకు పోవద్దని, క్రమశిక్షణ తప్పితే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. టీడీపీ కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు.. పార్టీ నేతలు, కార్యకర్తల ప్రవర్తనపై కీలక సూచనలు చేస్తూనే, మరోవైపు వైసీపీపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు.

**అతిగా ప్రవర్తిస్తే ప్రజలు హర్షించరు**

"ఈ మధ్య జరిగిన కొన్ని సంఘటనలు నన్ను తీవ్ర మనస్తాపానికి గురి చేశాయి. మనం సుపరిపాలన అనే యజ్ఞం చేస్తుంటే, మన నేతలే సరిగా వ్యవహరించకుంటే బాధ కలుగుతుంది.

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# బాబు లోకేష్ ఫుల్ బిజీ బిజీ !

ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి నారా లోకేష్ విశాఖలో రెండు రోజులు బిజీ బిజీగా గడిపారు. విశాఖలో రాత్రి బస చేసి మరీ ఊపిరాడని తీరులో సమావేశాలు నిర్వహించారు. ఇవన్నీ ఏపీ అభివృద్ధికి దోహదపడేవే అన్నది వేరేగా చెప్పాల్సిన పని లేదు. ఒక క్షణం తీరిక లేకుండా తండ్రీ కొడుకులు ఇద్దరూ అధికారిక హోదాలో విశాఖలో గడపడం మరింత విశేష్యం. సాధారణంగా చంద్రబాబు నుంచి ఇలాంటివి ఎన్నో అంతా చూశారు. ఆయన రోజులో ఎన్ని గంటలు అయినా అవిశ్రాంతంగా శ్రమిస్తారు. మీటింగుల మీద మీటింగులు పెడుతూ ఉంటారు. కానీ లోకేష్ కూడా అదే విధంగా అలుపు లేకుండా విశాఖలో మొత్తం అధికారిక కార్యక్రమాలలో పాల్గొనడం మీదనే చర్చ సాగుతోంది. విశాఖలో ఏయూ శతాబ్ది ఉత్సవాలలో పాల్గొనేందుకు సీఎం హోదాలో బాబు విద్యా మంత్రి హోదాలో లోకేష్ సోమవారం వచ్చారు. ఆ కార్యక్రమం తరువాత గూగుల్ ప్రతినిధులతో కలసి రాత్రి సమావేశం అయ్యారు. ఇక తెల్లారుతూనే ఆనందపురం మండలం వద్ద ఉన్న తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపనకు హాజరయ్యారు. అక్కడ ఇద్దరూ తమ స్పీచులతో అలరించారు. అక్కడ నుంచి చంద్రబాబు సింహాచలం వరాహ నరసింహ స్వామి వారిని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తో కలసి దర్శించుకున్నారు. ఆ మీదట ఏపీలో రైల్వే ప్రాజెక్టుల మీద చంద్రబాబు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో అనేక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. విశాఖకు ఏపీకి మేలు చేసే పలు ప్రాజెక్టుల విషయంలో కేంద్ర మంత్రి దృష్టికి బాబు తీసుకుని రావడం జరిగింది. ఇక విశాఖ కేంద్రంగా ఏర్పాటు అవుతున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలోకి మరి కొన్ని సెక్షన్లు కలుపుతూ పాలనా పరమైన మార్పులు చేయాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పరిధిలోకి వచ్చే అరకు – కొత్తవలస సెక్షన్ లను అలాగే కర్నూల్ డోన్ సెక్షన్లను కొత్త జోన్‌లో కలపడం ద్వారా ఆయా ప్రాంతాల అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని చంద్రబాబు చెప్పారు. అంతే కాకుండా రాష్ట్రంలో కీలకమైన ప్రాంతాలలో రైల్వే లైన్ల గురించి కేంద్ర మంత్రికి వివరించడం ద్వారా వాటి అభివృద్ధికి కొత్త లైన్ల ఏర్పాటు గురించి కూడా చర్చించారు. మరో వైపు ఐటీ మంత్రి నారా లోకేష్ ఐటీలో హైదరాబాద్ కంటే మెరుగ్గా విశాఖను మారుస్తాం అని ఒక కీలక ప్రకటన చేశారు. రానున్న పదేళ్ల కాలంలో విశాఖ నగరం ఐటీ హబ్‌గా మారుతుందని లోకేష్ చెప్పుకొచారు విశాఖలో గూగుల్ సంస్థ ఆధ్వర్యంలో విశాఖలో ఏఐ శక్తి కాన్‌క్లేవ్ నిర్వహించిన కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడుతూ ఐటీ అభివృద్ధిలో హైదరాబాద్ కంటే మేటిగా విశాఖను మారుస్తామని స్పష్టం చేశారు. విశాఖలో ఐటీ ఏఐకి సంబంధించి పూర్తి ఎకో సిస్టమ్ తయారు చేస్తున్నామని అన్నారు. డేటా సెంటర్లు తేవడమే కాదు వాటి నిర్వహణ కూడా కీలకమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలను తెచ్చి యువతకు ఉపాధి కల్పించమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలు, సంస్థల పురోగతిపై ప్రతి వారం సమీక్ష చేపడుతున్నామని లోకేష్ చెప్పడం విశేషం. మొత్తం మీద చంద్రబాబు లోకేష్ ఇద్దరూ రెండు రోజుల పాటు విశాఖలో అధికారిక కార్యక్రమాలలో ఫుల్ బిజీగా గడిపారు. విశాఖ గ్లోబల్ సిటీ అంటూ ప్రకటించడమే కాదు ఉత్తరాంధ్రాతో పాటు ఏపీ భవిష్యత్తు మరుతోందన్న గట్టి భరోసాను ఇచ్చారు.

# శభాష్... లోకేశ్ వర్కింగ్ స్టైల్ ను అభినందించిన సీఎం చంద్రబాబు

కార్యాలయంలో పార్టీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ సభ అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రబాబు... పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ లోకేశ్ ప్రతిభ, పట్టుదలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లోకేశ్ అత్యంత కీలక పాత్ర పోషించారు. కార్యకర్తలను నిరంతరం చైతన్యవంతం చేశారు. అధికారంలోకి వచ్చాక పార్టీని మరింత ముందుకు నడిపిస్తున్నారు. కార్యకర్తల సంక్షేమం నుంచి శిక్షణా తరగతుల వరకు అన్ని బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. 20 లక్షల ఉద్యోగాల హామీని నెరవేర్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఈరోజు ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయంటే దానికి లోకేశ్ కృషే కారణం. ఆయన సమర్థతను గుర్తించే వర్కింగ్ ప్రెసిడెంట్ అనే అత్యున్నత బాధ్యతను అప్పగించాం. ఇది పదవి కాదు, బాధ్యత" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**నూతన కమిటీ కూర్పుపై చంద్రబాబు వ్యాఖ్యలు**

కొత్త కార్యవర్గ కూర్పుపై మాట్లాడుతూ, ఎన్నో సమీకరణాలను పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు. "సీనియార్టీ, సిన్సియార్టీ, సోషల్ రీ-ఇంజనీరింగ్ ఆధారంగా ఈ కమిటీలను ఏర్పాటు చేశాం. సీనియర్ల అనుభవాన్ని గౌరవిస్తూనే, యువతకు, కొత్తవారికి అవకాశాలు కల్పించాం. కష్టపడి పనిచేసిన వారికే పట్టం కట్టాం. పార్టీ చరిత్రలో తొలిసారిగా ఒక మండల పార్టీ అధ్యక్షురాలికి, క్లస్టర్ ఇన్‌చార్జికి పొలిట్ బ్యూరోలో స్థానం కల్పించి 'కార్యకర్తే అధినేత' అనే నినాదాన్ని నిజం చేశాం. మహిళలకు పెద్దపీట వేశాం" అని వివరించారు.

**మనం సరిగ్గా పనిచేసిన దానికి నిదర్శనం అదే**

మరో మూడేళ్లలో ఎన్నికలు వస్తాయన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని చంద్రబాబు నేతలకు, కార్యకర్తలకు సూచించారు. "2024 ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ప్రతి బూత్‌లో కూటమికి ఎక్కువ ఓట్లు రావాలి. అదే మనం సరిగ్గా పనిచేసిన దానికి నిదర్శనం. మనం చేసిన అభివృద్ధి, తెచ్చిన మార్పు, పడిన కష్టాన్ని ప్రజలకు వివరించాలి. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ వెంటిలేటర్‌పై ఉంటే, కేంద్రం సహకారంతో దాన్ని గాడిన పెడుతున్నాం. సూపర్ సిక్స్ హామీలను నెరవేరుస్తూ, సంక్షేమాన్ని అందిస్తున్నాం. పోలవరం, అమరావతి పనులు మళ్లీ పరుగులు పెడుతున్నాయి. రాష్ట్రానికి పోయిన బ్రాండ్ ఇమేజ్‌ను తిరిగి తీసుకొస్తున్నాం" అని తెలిపారు.

**దేశానికి స్వాతంత్ర్యం కూడా తామే తెచ్చామని చెబుతారు**

ప్రతిపక్షంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "గొడ్డలి పార్టీకి 'సీసీడీ' (క్రెడిట్ చోరీ డిజార్డర్) అనే మానసిక వ్యాధి సోకింది. వీరిని ఇలాగే వదిలేస్తే, దేశానికి స్వాతంత్ర్యం కూడా తామే తెచ్చామని చెబుతారు. మనం చేసే మంచి పనులను అడ్డుకోవడమే వారి పని. సొంత బాబాయిని హత్య చేసి నెపం మనపై నెట్టారు. నా రాజకీయ జీవితంలో ఎంతోమంది నేతలతో పోరాడాను, కానీ తొలిసారిగా నేరస్తులతో పోరాడుతున్నాం. ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలి," అని పిలుపునిచ్చారు.

**అహం వీడి, క్రమశిక్షణతో మెలగాలి**

అధికారం వచ్చిందన్న అహం ప్రదర్శించవద్దని, బేషజాలకు పోవద్దని చంద్రబాబు నేతలకు హితవు పలికారు. "ప్రజలు మనల్ని గమనిస్తున్నారు. ఫ్లెక్సీలు, కుర్చీల కోసం గొడవలు పడవద్దు. పవన్ కల్యాణ్ తో నేను బాగానే ఉన్నాను. మిత్ర పక్షాలైన జనసేన, బీజేపీలతో కలిసికట్టుగా పనిచేయాలి. ప్రజలతో సౌమ్యంగా ఉంటూ, ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలవాలి. తప్పు చేస్తే పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా కాకుండా, మళ్లీ మళ్లీ గెలిచేలా ప్రజాసేవ చేయాలి" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### పవన్ కల్యాణ్‌తో నేను బాగానే ఉన్నా.. అతిగా ప్రవర్తిస్తే సహించేదిలేదు

# టీడీపీ నేతలకు చంద్రబాబు వార్నింగ్

ప్రజలతో సౌమ్యంగా ఉండాలి, వారికి అందుబాటులో ఉండాలి. నేతలు, కార్యకర్తలు చేసే తప్పులు పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తాయి" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలు, ఫొటోలు, కుర్చీల దగ్గర చిన్నపాటి గొడవలు కూడా రాకూడదని, అతిగా ప్రవర్తిస్తే ప్రజలు హర్షించరని హితవు పలికారు. గత పాలకుల గర్వాన్ని, అహంకారాన్ని చూసే ప్రజలు వారికి బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. బూతులు, దాడులు, సెటిల్మెంట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

**మిత్రపక్షాలతో సమన్వయం అత్యవసరం**

కూటమి ధర్మాన్ని పాటిస్తూ జనసేన, బీజేపీ నేతలతో సమన్వయంతో ముందుకు సాగాలని చంద్రబాబు స్పష్టం చేశారు. "నేను, పవన్ కల్యాణ్ ఎంతో చక్కగా ఉంటున్నాం. మంచి సంబంధాలు కొనసాగిస్తున్నాం. ఇదే స్ఫూర్తి క్షేత్రస్థాయిలోనూ కనిపించాలి. బీజేపీని కూడా సమన్వయం చేసుకుని వెళ్లాలి. రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య గ్యాప్ లేదు, రాకూడదు" అని ఆయన పేర్కొన్నారు. తాను లేకుండా ఎంపీ రాకూడదని ఎమ్మెల్యేలు అనడం సరైన పద్ధతి కాదని, అందరూ మనస్పర్థలు లేకుండా పనిచేయాలని సూచించారు.

**నేరస్థులతో పోరాడుతున్నాం**

ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నా రాజకీయ జీవితంలో ఎంతోమంది నేతలతో పోరాడాను. కానీ తొలిసారిగా నేరస్థులతో పోరాడుతున్నాం. సొంత బాబాయి వివేకాను హత్య చేసి ఆ నెపాన్ని మనపై నెట్టారు. తమ కార్యకర్తను కారుతో తొక్కించి ఆ పాపాన్ని కూడా మనకే అంటించారు. కబ్జా చేసిన ఆస్తుల కోసం కడపలో అనుచరుడినే చంపేశారు" అని తీవ్ర ఆరోపణలు చేశారు. వాస్తవాలు బయటపడితే ఎదురుదాడి చేయడం వారికి అలవాటని విమర్శించారు. మనది అభివృద్ధి అయితే వాళ్లది అవినీతి అని, మనది వికాసం అయితే వాళ్లది విధ్వంసమని అన్నారు.

**భవిష్యత్ ఎన్నికలే లక్ష్యం**

రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రజలు కూటమికి ఓటేశారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని చంద్రబాబు అన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్షంగా విజయం సాధించాలని పిలుపునిచ్చారు. "మరో మూడేళ్లలో మళ్లీ ఎన్నికలు వస్తాయి. 2024లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు సాధించాలి. అప్పుడే మనం బాగా పనిచేసినట్టు. వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా ఉండొద్దు, మళ్లీ మళ్లీ గెలవాలి. పనిచేసిన వారికే పదవులు వస్తాయి" అని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేసి పార్టీ ప్రతిష్టను పెంచాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

# "స్పీడీ ట్రయల్" అంటే ఏమిటి..?




దేశంలో కోర్టు కేసులు సంవత్సరాల తరబడి సాగిపోవడం సాధారణమైపోయిన నేపథ్యంలో, "స్పీడీ ట్రయల్" లేదా "త్వరిత విచారణ" హక్కు మళ్లీ ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. విచారణ అనవసరంగా ఆలస్యం కాకుండా, తగిన సమయంలో న్యాయం పొందడం ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కు. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు మరియు వ్యక్తిగత స్వేచ్ఛ) పరిధిలో భాగంగా గుర్తించబడింది. ఈ హక్కుకు బలమైన పునాది 1978లో సుప్రీంకోర్టు ఇచ్చిన మేనకా గాంధీ, యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పుతో ఏర్పడింది. తరువాత 1979లో వచ్చిన హుస్సేనారా ఖాటూన్, స్టేట్ ఆఫ్ బీహార్ కేసులో కోర్టు స్పష్టంగా పేర్కొంది. "విచారణ ఆలస్యం అవడం అనేది న్యాయం నిరాకరించినట్టే." ఈ తీర్పులు భారత న్యాయవ్యవస్థలో వేగవంతమైన విచారణకు రాజ్యాంగ పరిరక్షణను కల్పించాయి. త్వరిత విచారణ హక్కు ఉల్లంఘనకు గురవుతున్న సందర్భాలు అనేకం. ఏళ్ల తరబడి కేసు విచారణ సాగకుండా ఉండటం, నిందితుడు విచారణ లేకుండానే జైలులో ఎక్కువకాలం గడపడం, సాక్షాలు ఉన్నప్పటికీ విచారణ ముందుకు సాగకపోవడం, కోర్టుల్లో తరచూ వాయిదాలు పడటం వంటి పరిస్థితుల్లో బాధితులు లేదా నిందితులు కోర్టును ఆశ్రయించవచ్చు. ఇలాంటి సందర్భాల్లో హైకోర్టు (ఆర్టికల్ 226) లేదా సుప్రీంకోర్టు (ఆర్టికల్ 32) లో "రిట్ పిటిషన్" దాఖలు చేయవచ్చు. ముఖ్యంగా "మాండమస్ రిట్" లేదా "హబీయాస్ కోర్పస్ " ద్వారా విచారణను వేగవంతం చేయమని కోర్టును కోరే అవకాశం ఉంది. పిటిషన్‌లో కేసు ఆలస్యం కారణాలు, విచారణలో జరిగిన జాప్యం, మరియు ఆర్టికల్ 21 కింద ఉన్న హక్కుల ఉల్లంఘన వివరాలు స్పష్టంగా పేర్కొనాలి. ఇలాంటి పిటిషన్‌లను పరిశీలించిన తర్వాత కోర్టులు కీలక నిర్ణయాలు తీసుకునే అధికారం కలిగి ఉంటాయి. అవసరమైతే లోయర్ కోర్టులకు, పోలీసులకు విచారణ వేగవంతం చేయమని ఆదేశాలు జారీ చేయవచ్చు. తీవ్ర ఆలస్యం జరిగిన సందర్భాల్లో కేసును రద్దు చేయడం, అనవసరంగా జైలులో ఉన్నవారిని విడుదల చేయడం, లేదా బాధితులకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించడం వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. న్యాయపరంగా కూడా ఈ హక్కును బలపరిచే పలు కీలక తీర్పులు వెలువడ్డాయి. ఎ.ఆర్. అంతులే వర్సెస్ ఆర్.ఎస్. నాయక్ (1992) కేసులో విచారణ ఆలస్యం జీవనహక్కును ఉల్లంఘిస్తుందని కోర్టు పేర్కొంది. కద్రా పహాడియా, స్టేట్ ఆఫ్ బీహార్ (1983) లో అండర్‌ట్రయల్ ఖైదీల దీర్ఘకాల నిర్బంధం రాజ్యాంగ విరుద్ధమని తేల్చింది. అలాగే పి . రామచంద్ర రావు, కర్ణాటక ప్రభుత్వం కేసులో (2002) లో విచారణకు కఠిన సమయ పరిమితులు పెట్టలేమని, కానీ ఆలస్యానికి సరైన కారణం ఉండాలని స్పష్టం చేసింది. న్యాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం, త్వరిత విచారణ హక్కు కేవలం నిందితులకు మాత్రమే కాదు, బాధితులకు కూడా సమానంగా ముఖ్యమైనది. ఆలస్యమైన న్యాయం వల్ల బాధితులు మానసికంగా, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో నిర్దోషులు సంవత్సరాల తరబడి జైల్లో ఉండాల్సి వస్తోంది. మొత్తంగా చూస్తే, "స్పీడీ ట్రయల్" హక్కు న్యాయవ్యవస్థలో న్యాయం సకాలంలో అందేలా చేసే కీలక సాధనం. కోర్టులపై పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించేందుకు, విచారణ ప్రక్రియలో పారదర్శకత, బాధ్యత పెంచేందుకు ఈ హక్కు సమర్థవంతంగా అమలు కావాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

జె. కనక దుర్గ లక్ష్మీ
ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ (IHR)
ఉత్తరాంధ్ర ఇంచార్జి.

## మొదటి పేజీ తరువాయి

# యూపీ అభివృద్ధికి కొత్త జీవనాడి..

చేశారు. గంగా మాత పరిసర ప్రాంతాల గుండా వెళ్లే ఈ ప్రాజెక్టు ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి కొత్త ఊతమిస్తుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ... "గంగామాత ఈ దేశానికి, యూపీకి ఎలా జీవనాడిగా ఉందో, అలాగే ఈ ఎక్స్‌ప్రెస్‌వే కూడా రాష్ట్ర అభివృద్ధికి కొత్త జీవనాడిగా మారుతుంది. ఈ రహదారికి గంగా మాత పేరు పెట్టడం సంతోషంగా ఉంది. ఇది మన అభివృద్ధి దార్శనికతతో పాటు మన గొప్ప వారసత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది" అని అన్నారు. ఈ ఎక్స్‌ప్రెస్‌వేతో ప్రయాగ్‌రాజ్‌లోని సంగం, కాశీలోని బాబా విశ్వనాథుడి దర్శనం గంటల వ్యవధిలోనే సాధ్యమవుతుందని ఆయన వివరించారు.

**ప్రాజెక్టు ముఖ్యాంశాలు**

ఈ గంగా ఎక్స్‌ప్రెస్‌వే 594 కిలోమీటర్ల పొడవైన 6-లేన్ల యాక్సెస్-కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైవే. భవిష్యత్తులో దీనిని 8 లేన్లకు విస్తరించవచ్చు. ఇది ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ, మధ్య, తూర్పు ప్రాంతాలను కలుపుతూ మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ వరకు 12 జిల్లాల గుండా వెళుతుంది. దీనివల్ల మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ మధ్య ప్రస్తుతం 10 నుంచి 12 గంటలుగా ఉన్న ప్రయాణ సమయం కేవలం 6 గంటలకు తగ్గుతుంది. ఈ ప్రాజెక్టులో మరో కీలకమైన అంశం షాజహాన్‌పూర్ జిల్లాలో ఏర్పాటు చేసిన 3.5 కిలోమీటర్ల ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఎయిర్‌స్ట్రిప్). ఇది దేశ రక్షణ సన్నద్ధతకు, వ్యూహాత్మక అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ రహదారి వెంట పారిశ్రామిక, లాజిస్టిక్స్ కారిడార్లను అభివృద్ధి చేయనున్నారు. ఇది పరిశ్రమలను ఆకర్షించడం, రైతులకు మెరుగైన మార్కెట్ సౌకర్యం కల్పించడం, పర్యాటకాన్ని ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంచడం వంటి బహుళ ప్రయోజనాలను అందిస్తుందని అధికారిక ప్రకటనలో తెలిపారు. ఆగ్రా-లక్నో వంటి ఇతర ఎక్స్‌ప్రెస్‌వేలతో ఈ రహదారి అనుసంధానమై, రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుంది.

# ఇంధనాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు

సందర్భంగా ఇంధన బంకుల నిర్వహణపై పలు కీలక సూచనలు చేశారు. కొన్ని బంకుల్లో స్టాక్ ఉన్నప్పటికీ 'నో స్టాక్' బోర్డులు పెట్టి వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నారని, అలాంటి యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంధన లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం అమలు చేస్తున్న 'రేషన్ పద్ధతి'ని కొనసాగించాలని సూచించారు. ముఖ్యంగా ఆక్వా, వరి రైతులకు వ్యవసాయ పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంధన సరఫరాలో ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా ఇంధన కొరతపై తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించే వారిని గుర్తించి, వెంటనే కేసులు నమోదు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. ఇంధనం పోయడానికి నిరాకరిస్తున్న బంకులపై 1967 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. గతంతో పోలిస్తే రాష్ట్రంలో బంకుల మూసివేత గణనీయంగా తగ్గిందని, చమురు కంపెనీల నుంచి ఇంధన సరఫరా కూడా మెరుగుపడిందని నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.

# ఏపీ టెన్త్ ఫలితాలు నేడే..

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఏపీలో పదో తరగతి పరీక్ష ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు ముఖ్యమైన అప్‌డేట్. పదో తరగతి పరీక్ష ఫలితాలు రేపు (ఏప్రిల్ 30) ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. ఫలితాలను సులువుగా తెలుసుకునేందుకు ప్రభుత్వం పలు మార్గాలను అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థులు తమ ఫలితాలను తీవంబశ్రీం.ఎంవ.ఖజూ.స్త్రశీజ.ఱఅ అనే అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. వీటితో పాటు మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009కు 'హాయ్' అని సందేశం పంపడం ద్వారా కూడా ఫలితాలను పొందవచ్చని మంత్రి లోకేశ్ తెలిపారు. అలాగే, లీప్ యాప్ ద్వారా కూడా రిజల్ట్స్ తెలుసుకోవచ్చని ఆయన సూచించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ స్కూల్ లాగిన్ ద్వారా నేరుగా మార్కుల మెమోలను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించారు. ఈ ఏడాది మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగిన పదో తరగతి పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6.30 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాల విడుదల నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఉత్కంఠ నెలకొంది.

# ఒపెక్ నుంచి యూఏఈ ఎగ్జిట్.. భారత్‌కు మంచిదే

రాలేమన్నారు.

**రూపాయిల్లో చెల్లింపులకు అవకాశం..:** ఒపెక్ నుంచి యూఏఈ వైదొలగడం వల్ల భవిష్యత్‌లో ప్రపంచ చమురు మార్కెట్‌లోకి క్రూడాయిల్ సరఫరా పెరుగుతుందని కోటక్ సెక్యూరిటీస్‌లో రీసెర్చ్ హెడ్ ఆనింద్య బెనర్జీ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితులు మెరుగుపడ్డాక సరఫరా పుంజుకొంటుందని చెప్పారు. అలాగే, భారత్, యూఏఈ మధ్య వ్యూహాత్మక సంబంధాలు మరింత బలపడనున్నాయని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా చమురు కొనుగోళ్లకు రూపాయిల్లో చెల్లింపుల్లో వేగం పుంజుకొనే అవకాశం ఉందన్నారు. డాలర్లకు బదులుగా భారతీయ రూపాయిల్లో చమురు కొనుగోలు చేసే అవకాశం పెరుగుతుందని బెనర్జీ పేర్కొన్నారు.

## "మే డే" సందర్భంగా నగరంలో వ్యర్థాల సేకరణ జరగదు

**మే 2 వ తేదీన విధులకు హాజరగు పారిశుద్ధ్య కార్మికులకు నివాసితులు వ్యర్థాలను దాచి ఉంచి అందించాలి.**

**-జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్ కుమార్.**



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్-29:**

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మే 1వ తేది అనగా శుక్రవారం "మే డే" సెలవు దినం సందర్భంగా నగరంలో ఇంటింటి నుండి వ్యర్థాల సేకరణ ప్రక్రియకు ఆటంకం కలుగుతుందని .., మే 2వ తేదీన అనగా శనివారం విధులకు హాజరగు పారిశుద్ధ్య కార్మికులకు నివాసితులు వ్యర్థాలను తమ వద్ద దాచి ఉంచి అందించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలతో ప్రధాన వైద్యాధికారి డాక్టర్.ఇ.ఎన్.వి.నరేష్ కుమార్ బుధవారం పత్రికా ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేసారు.

## ఉత్తరాంధ్రలో నేటి నుంచి బీసీ కమిషన్ పర్యటన

**ప్రజా వినతుల స్వీకరణకు, సమీక్షకు ప్రత్యేక కార్యక్రమాలు**

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 29**

వెనుకబడిన తరగతుల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు, వర్గాల వారీ అభ్యర్థనలను సమగ్రంగా అధ్యయనం చేయడానికి బీసీ కమిషన్ గురువారం నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించనుంది. పర్యటనలో భాగంగా కమిషన్ సభ్యులు జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ, వివిధ కుల సంఘాలు, పౌరసంఘాలు, ప్రజాప్రతినిధులు, సాధారణ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించనున్నారు. సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, పరిష్కారానికి తగిన సూచనలు ఇవ్వనున్నారు. షెడ్యూల్ ప్రకారం 30న విశాఖపట్నంలో కమిషన్ అధికారులు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించడంతో పాటు, బీసీ వర్గాలకు చెందిన సంఘాలు, ఆసక్తి గల ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. అనంతరం నిపుణులతో ప్రత్యేక చర్చలు జరపనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాల్సిందిగా విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా మే 1న కమిషన్ శ్రీకాకుళం జిల్లాకు వెళ్లి అక్కడి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడంతో పాటు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించనుంది. అనంతరం ఫీల్డ్ విజిట్ చేసి స్థానిక పరిస్థితులను పరిశీలించనుంది. మే 2న విజయనగరం జిల్లాలో కూడా ఇదే విధంగా సమీక్ష సమావేశాలు నిర్వహించి, వివిధ వర్గాల ప్రతినిధులతో చర్చలు జరపనున్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, సంబంధిత అంశాలపై నివేదిక సిద్ధం చేయనున్నారు. అదే రోజు సాయంత్రం తిరిగి విశాఖపట్నానికి చేరుకుంటారు. మే 3న కమిషన్ విశాఖపట్నం నుంచి రాజమండ్రికి బయలుదేరి, మే 4న అక్కడి అధికారులతో సమీక్ష నిర్వహించి పర్యటనను ముగించనుంది. ఈ సందర్భంగా బీసీ వర్గాలకు చెందిన ప్రజలు, సంఘాల ప్రతినిధులు తమ సమస్యలు, అభ్యర్థనలు కమిషన్ దృష్టికి తీసుకురావాలని అధికారులు కోరారు.

## ప్రజా సమస్యలపై నిరంతర పోరాటమే లక్ష్యం : వాసుపల్లి



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :29**

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేయాలని వైసీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సౌత్ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి కార్యకర్త ప్రజల మధ్య చురుకుగా పనిచేసి పార్టీ పునాదులను మరింత దృఢం చేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజల తరఫున పోరాటం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంతో పాటు, వాటి ప్రభావాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని కోరారు. అదే సమయంలో, రిజిస్ట్రేషన్ ఓటీపీ ప్రక్రియను వేగవంతం చేసి, పార్టీ కార్యకలాపాలను సాంకేతికంగా మరింత సమర్థవంతం చేయాలని సూచించారు. ఇటీవల జగదంబ జంక్షన్ వద్ద పెట్రోల్, డీజిల్ సమస్యపై తన పిలుపుమేరకు నిర్వహించిన కార్యక్రమం విజయవంతం కావడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ ఎప్పటికీ ముందుండి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో దక్షిణ నియోజకవర్గ వార్డు అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా మరియు నియోజకవర్గ స్థాయి అనుబంధ సంఘాల సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# మే 1 నుంచి ప్రధాన జనగణనకు సమగ్ర సిద్ధత అవసరం

## కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్,ఏప్రిల్:29**

జనగణన-2027 ప్రక్రియను సమర్థవంతంగా, సమగ్రంగా నిర్వహించేందుకు అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక సూచనలు చేశారు. మార్చి 16 నుంచి ప్రారంభమైన స్వీయ గణన ఇప్పటివరకు 86.49 శాతం మాత్రమే పూర్తయిందని పేర్కొంటూ, దీన్ని 100 శాతానికి చేరేలా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ప్రతిరోజూ పురోగతిని ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి పర్యవేక్షించాలి, అదనపు సెన్సస్ అధికారి సమన్వయం చేయాలని అన్నారు. మే 1 నుంచి ప్రారంభమయ్యే ప్రధాన జనగణన ప్రక్రియను విజయవంతం చేసేందుకు పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. అధికారులు సమావేశాలకు పూర్తి సమాచారంతో హాజరుకావాలని, అవసరం లేని సిబ్బందిని తీసుకురావద్దని స్పష్టం చేశారు.జనగణనపై పూర్తి అవగాహన కలిగి ఉండేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, ఛార్జ్ మరియు స్పెషల్ ఛార్జ్ అధికారుల నియామకంపై దృష్టి పెట్టాలని అన్నారు.





ప్రత్యేక గ్రూప్ ఏర్పాటు చేసి, ప్రతిరోజూ నివేదికలు అప్డేట్ చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధి హామీ కార్మికులు, పోలీసు సిబ్బంది సహా అన్ని వర్గాల ప్రజలు తప్పనిసరిగా స్వీయ గణనలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల వారీగా పురోగతి నివేదికలు సమర్పించాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాలు, కార్మికులు, ఇతర పౌరులతో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి 100 శాతం లక్ష్యం సాధించాలని సూచించారు. ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు తమ కిట్లు, మొబైల్ యాప్ వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అవసరమైతే టెలికాన్ఫరెన్స్ ద్వారా మార్గనిర్దేశం చేయాలని పేర్కొన్నారు. రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జనగణన విధుల్లో ఎవరికి మినహాయింపు లేదని, సిఫార్సులకు తావులేదని స్పష్టం చేసిన కలెక్టర్, విశాఖపట్నం జిల్లాను అన్ని రంగాల్లో

# అల్లూరిలో కలిచివేసే ఘటన

## రహదారి లేక అడవిలో ప్రసవం



**అల్లూరి జిల్లా, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :29**

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతం మరోసారి మౌలిక వసతుల లోపాన్ని బహిర్గతం చేస్తూ కలిచివేసే ఘటనకు వేదికైంది. జి.మాడుగుల మండలం, పెదలోచల పంచాయతీ పరిధిలోని ఇండుగుల గ్రామానికి చెందిన గర్భిణి మహిళ, ఆసుపత్రికి తరలించే మార్గం లేక అడవి మధ్యలోనే ప్రసవించాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామం నుంచి సమీప తారు రోడ్డు వరకు సుమారు మూడు కిలోమీటర్ల దూరం పూర్తిగా అడవి మార్గమే. ఎటువంటి రహదారి సౌకర్యం లేకపోవడంతో, ప్రసవ వేదనలో ఉన్న మహిళను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలిసి దారిలేని మార్గంలో మోసుకుంటూ తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు. అయితే పరిస్థితి విషమించడంతో మధ్యలోనే ప్రసవం జరగడం తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఈ ఘటన కేవలం ఒక కుటుంబం ఎదుర్కొన్న కష్టం మాత్రమే కాదు ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల జీవితాల అసలైన వాస్తవాన్ని బయటపెడుతోంది. అత్యవసర వైద్య సేవలు అందాల్సిన సమయంలో కూడా రోడ్డు లేక ప్రాణాలే పణంగా పెట్టాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. గ్రామస్తుల ప్రకారం, ఇండుగుల సహా పరిసర ప్రాంతాల్లో గర్భిణీలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు తరచూ ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలు అందుబాటులోకి రావడం అసాధ్యంగా మారుతోంది. పలు సార్లు అధికారులకు వినతులు చేసినా, ఇప్పటివరకు రహదారి నిర్మాణం దిశగా స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్టు ప్రకటించినా, నేలస్థాయిలో పరిస్థితులు మాత్రం మారడం లేదని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. గర్భిణి మహిళ అడవిలో ప్రసవించాల్సి రావడం, ఆరోగ్య హక్కు ఎంత దూరంలో ఉందో తెలియజేస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, ఐటిడిఏ అధికారులు వెంటనే స్పందించి ఇండుగుల గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించడంపై అత్యవసర చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే ఫీల్డ్ స్థాయిలో పరిస్థితులను సమీక్షించి, గిరిజనులకు కనీస మౌలిక వసతులు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మానవత్వాన్ని ప్రశ్నించే ఈ ఘటనపై ప్రభుత్వం గంభీరంగా స్పందించకపోతే, ఇది కేవలం ఒక వార్తగానే మిగిలిపోదు, వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనంగా నిలిచిపోతుంది.

# పెట్రోల్, డీజిల్ కొరతపై అపోహలు వద్దు

## కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్ఏప్రిల్ :29**

నగరంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న ప్రచారం పూర్తిగా అసత్యమని, ప్రజలు అపోహలకు లోనవకుండా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ స్పష్టం చేశారు. రేసపువానిపాలెం పరిధిలోని రామాటాకీస్ సమీపంలోని హెచ్‌పి పెట్రోల్ బంకును ఆయన బుధవారం తనిఖీ చేసి, సివిల్ సప్లైస్ మరియు లీగల్ మెట్రాలజీ అధికారులతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 123 పెట్రోల్ బంకులు పనిచేస్తున్నాయని, ఎక్కడా ఇంధన కొరత లేదని తెలిపారు. ఇటీవల ఒకటి రెండు బంకుల్లో తాత్కాలికంగా స్టాక్ లేకపోవడంతో కొరత ఉందన్న అపోహలు వ్యాపించాయని, కానీ వాస్తవానికి సరిపడా నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాల ప్రభావంతో సాధారణ స్థాయికి మించి ఇంధన కొనుగోళ్లు జరుగుతుండటంతో కొన్ని బంకుల వద్ద క్యూలు కనిపిస్తున్నాయని వివరించారు.ప్రజలు పానిక్ బైయింగ్‌కు దిగకుండా, అవసరమైనప్పుడే ఇంధనం తీసుకోవాలని సూచించారు. భారత పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ సంస్థల వద్ద తగిన నిల్వలు ఉన్నాయని, సరఫరా నిరంతరంగా కొనసాగుతోందని తెలిపారు. అనవసరంగా నిల్వలు చేసుకోవడం వల్ల ఇతరులకు ఇబ్బందులు తలెత్తుతాయని హెచ్చరించారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా సాధారణంగా ఉందని, ఎలాంటి కొరత లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక పోలమాంబ ఆలయం వద్ద ఉన్న హెచ్‌పి పెట్రోల్ బంకును జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి తనిఖీ చేసి, స్టాక్ వివరాలు పరిశీలించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇంధన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ఆమె తెలిపారు. ఈ తనిఖీలలో జిల్లా పౌర సరఫరాల అధికారి భాస్కరరావు, ఏఎస్వో కల్యాణి, లీగల్ మెట్రాలజీ అధికారులు, హెచ్‌పి సేల్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పార్టీ కార్యకర్తకు అండగా వాసుపల్లి.. రూ.5 వేల ఆర్థిక సాయం



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :29**

విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గంలో వైసీపీ నాయకత్వం మరోసారి కార్యకర్తల పట్ల తమ బాధ్యతను చాటుకుంది. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని వైసీపీ విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ స్పష్టం చేశారు. దక్షిణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకుల శ్యామ్ భార్య ఆకుల రోజా రాణి కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలిసిన వాసుపల్లి, ఇప్పటికే రెండు సార్లు ఆర్థిక సహాయం అందించారు. మొదటిసారి రూ.10,000, అనంతరం రూ.5,000 అందించిన ఆయన, తాజాగా రక్తం కొనుగోలు కోసం కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను తెలుసుకుని మరోసారి స్పందించారు. హాస్పిటల్‌కు స్వయంగా వెళ్లి రోజా రాణిని పరామర్శించిన వాసుపల్లి, ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. మెరుగైన చికిత్స అందించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్‌ను ప్రత్యేకంగా కోరారు. ఈ సందర్భంగా మరో రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, అండ ఉంటుందని తెలిపారు. ఎలాంటి కష్టాల్లో ఉన్నా పార్టీ వారిని ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. రాబోయే కాలంలో వైసీపీ ప్రభుత్వమే తిరిగి అధికారంలోకి వస్తుందని, జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 30వ వార్డు నాయకుడు దస్మాంతుల మాణిక్యాలరావు, బీసీ సెల్ అధ్యక్షుడు వేణు, జిల్లా నాయకులు మూతబత్తుల రమేష్, గోవింద్ రాజు, చింతకాయల వాసు, సింహాద్రి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## 2029లోనూ సీఎం కుర్చీ టీడీపీకే: పల్లా శ్రీనివాసరావు ధీమా

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :29**



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి 2029 ఎన్నికలపై చర్చ మొదలైంది. పల్లా శ్రీనివాసరావు చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. గాజువాక ఎమ్మెల్యేగా, అలాగే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆయన మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన, నారా లోకేశ్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధిస్తుందని, ఆ ఎన్నికల తర్వాత కూడా ముఖ్యమంత్రి పదవి టీడీపీదేనని ధీమా వ్యక్తం చేశారు. "అధికారంలో ఉన్నప్పుడే పదవులు, అవకాశాలు వస్తాయి. అందుకే ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ఐక్యంగా పని చేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ అంతర్గత ఐక్యత, క్రమశిక్షణతో ముందుకు సాగితే భవిష్యత్తు టీడీపీదేనని ఆయన అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో టీడీపీకి అనుభవం ఉందని కూడా ఆయన గుర్తుచేశారు. అయితే ఈ వ్యాఖ్యలు రాజకీయ మిత్రపక్షాల్లో ఎలా ప్రతిస్పందన తెస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా జనసేన పార్టీ, భారతీయ జనతా పార్టీ నాయకులు ఈ వ్యాఖ్యలపై ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేస్తారన్నదిపై రాజకీయ వర్గాలు దృష్టి సారించాయి. మొత్తానికి, 2029 ఎన్నికలపై ముందస్తు రాజకీయ అంచనాలు వేస్తూ చేసిన ఈ వ్యాఖ్యలు భవిష్యత్తు రాజకీయ సమీకరణాలపై కొత్త చర్చలకు దారితీశాయి.

## నేషనల్ హైవేపై ప్రమాదాల నివారణకు

# అనకాపల్లి పోలీసుల హై అలర్ట్






**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :29**

జిల్లాలో పెరుగుతున్న నేషనల్ హైవే రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో అనకాపల్లి పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ (క్రైమ్) ఎల్. మోహన్ రావు హైవే మొబైల్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైవేపై విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైరన్ వినిపిస్తూ, రేడియం జాకెట్లు ధరించి, బార్ లైట్లు ఆన్ చేసి వాహనదారులను హెచ్చరించాలని ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి 10:00 గంటల నుంచి ఉదయం 5:00 గంటల మధ్య పీక్ సమయాల్లో ఫేస్ వాష్ కార్యక్రమాలు నిర్వహించి, డ్రైవర్లను నిద్రమత్తు నుంచి దూరంగా ఉంచే చర్యలు తీసుకోవాలని చెప్పారు. హైవేపై ఓవర్‌టేకింగ్ కారణంగా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనదారులు జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. హైవే పరిధిలోని పోలీస్ స్టేషన్లు, హైవే మొబైల్ సిబ్బందితో సమన్వయంగా పనిచేయాలని తెలిపారు. అపఘాతాలకు ఎక్కువ అవకాశమున్న తొమ్మిది ప్రమాద ప్రదేశాల్లో ప్రత్యేకంగా ఫేస్ వాష్ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. వాహనాల వేగ నియంత్రణ, ద్విచక్ర వాహనదారులు మరియు పాదచారుల భద్రతపై తక్షణ చర్యల ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇంకా, ఒక ప్రమాదం ఒక కుటుంబాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని, వాహనదారుల నిర్లక్ష్యం, నిద్రమత్తు, అతివేగం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల పోలీసులు మరింత బాధ్యతగా, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణ రక్షణే లక్ష్యంగా, హైవేపై ప్రయాణించే వారు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ట్రాన్స్కో సమస్యలపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం





**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 29**

అయినవిల్లి నందు లో వోల్టేజ్ పరిష్కారానికై ఏర్పాటు చేస్తున్న 400 కె..వి.ట్రాన్స్మిషన్ లైన్ నిర్మాణం లో ఎదురైన సమస్యల పరస్పర సహకారం సామరస్య పూరితంగా పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ట్రాన్స్కో ఇంజనీర్లు కు సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు ట్రాన్స్మిషన్ లైన్ ఏర్పాట్లు ఎదురైన రెండు సమస్యలపై ఆయన ట్రాన్స్కో ఇంజనీర్లతో సమీక్షించారు. చిరుత పూడి ప్రభల తీర్థం కు అడ్డంకిగా ట్రాన్స్మిషన్ లైను రావడంతో పక్కకు జరపాలని ఉత్సవ ప్రతినిధులు కోరుతున్నారని, స్థానిక ప్రజాప్రతినిధులు ఉత్సవ ప్రకృతినిధులతో పరస్పరం చర్చలు జరుపుతూ ప్రత్యామ్నాయ పరిష్కార చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రావులపాలెం మండలం దేవరపల్లి గ్రామం నందు ముందుగా టవర్ నిర్మించే భూ యజమాని అంగీకారం తెలిపి నప్పటికీ ప్రస్తుతం అభ్యంతరం పెడుతున్నారని దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు రైతుల సహకారంతో రైతును ఒప్పించి లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్కో పర్యవేక్షక ఇంజనీర్ జీ వి టి హెచ్ బాలాజీ కార్యనిర్వాహక ఇంజనీర్ వై పుల్లయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పివి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## మే 9-న మెగా లోక్ అదాలత్



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 29**

మే నెల 9 న స్థానిక కోర్టు ల సముదాయింలో జరగనున్న మెగా లోక్ అదాలత్ ను ఎక్సైజ్ పరంగా కేసులు ఉన్న కక్షిదారులు సద్వినియోగం చేసుకొవి కేసులను పరిష్కరించుకోవాలని ఎక్సైజ్ సి ఐ సత్యనారాయిణ ఓ ప్రకటనలో తెలిపారు . రాజీ మార్గంలో ఎక్సైజ్ కేసులను పరిష్కరించుకునే వారికి లోక్ అదాలత్ ఓ మంచి అవకాశమని సిఐ వీటి వి వి సత్యనారాయణ మాచించారు.

## వి. కోట పాత్రికేయుని హత్యపై నిరసన

### భగ్గుమన్న పాత్రికేయులు రాజకీయ నేతలు ప్రజా సంఘాల నేతలు




**పెద్ద తిప్ప సముద్రం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 29**

అన్నమయ్య మదనపల్లి జిల్లా వి కోట ఆంధ్రజ్యోతి పాత్రికేయుడిగా పనిచేస్తున్న జగన్మోహన్ రెడ్డి హత్యపై పిటీఎం నందు నిరసన కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి పాత్రికేయులు కూటమి నాయకులు ప్రజాసంఘాలు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి నిరసనలు ధర్నా కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ప్రజల సమస్యలపై పోరాడే పాత్రికేయులపై ఇలాంటి ఘటనలు జరిగితే ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే వారే కరువుతారు పాత్రికేయుడు జగన్మోహన్ రెడ్డి హత్య అత్యంత బాధాకరమనీ హత్యకు గల కారణాలు ఏవైనా ఉన్న అంత కిరాతకంగా చంపడం అనేది చాలా బాధాకరం ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ఈలాంటి వారికి కఠినమైన శిక్షలు అమలు చేయాలని పాత్రికేయుడు జగన్మోహన్ రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుకుంటున్నాం తదుపరి పి టి ఏం మండల తహసిల్దారు కార్యాలయంలో పాత్రికేయులు కలసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

## నిజాన్ని బయటపెడితే దాడులా?

# జర్నలిస్టుల భద్రత ఎక్కడ




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

దేశంలో జర్నలిజం స్వేచ్ఛపై గంభీరమైన ముప్పు నెలకొన్నదనే ఆందోళనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల చోటుచేసుకున్న జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, ఒత్తిళ్లు కేవలం వ్యక్తిగత ఘటనలుగా కాకుండా, ఒక విస్తృత సమస్యగా మారుతున్న సంకేతాలు ఇస్తున్నాయి. అక్రమాలు, అవినీతి, స్థానిక సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేసిన ప్రతిసారీ జర్నలిస్టులు లక్ష్యంగా మారుతున్న పరిస్థితి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. “వార్త రాస్తే దాడి” అనే వాస్తవం ఇప్పుడు అనుభవంగా మారుతోందన్న భావన మీడియా వర్గాల్లో బలపడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో భూకబ్జాలు, ఇసుక మాఫియా, అక్రమ రవాణా, అధికార దుర్వినియోగం వంటి అంశాలపై రిపోర్టింగ్ చేసిన జర్నలిస్టులు దాడులకు గురయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరికి ఫోన్ బెదిరింపులు, మరికొందరికి ప్రత్యక్షంగా దాడులు జరగడం, పరికరాలు ధ్వంసం చేయడం వంటి ఘటనలు నమోదవుతున్నాయి. పోలీసులకు ఫిర్యాదులు ఇచ్చినా, కేసుల నమోదు ఆలస్యం, విచారణలో నెమ్మదితనం వంటి అంశాలు బాధితుల్లో న్యాయం పై అనుమానాలు పెంచుతున్నాయి. ఇది కేవలం వ్యక్తిగత భద్రత సమస్య కాదు, సమాజానికి నిజాలను అందించే వ్యవస్థనే బలహీనపరచే ప్రమాదం. ఈ సమస్య ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాలేదు. ఉత్తరప్రదేశ్‌లో అక్రమ మైనింగ్, స్థానిక రాజకీయ అవినీతి అంశాలను వెలుగులోకి తెచ్చిన జర్నలిస్టులపై దాడులు, అరెస్టులు చోటుచేసుకున్నాయి. బీహార్‌లో గ్రామీణ ప్రాంతాల్లో అవినీతి కథనాలు రాసిన రిపోర్టర్లపై గుంపులుగా దాడులు జరిగిన ఘటనలు నమోదయ్యాయి. మహారాష్ట్రలో స్థానిక మాఫియా కార్యకలాపాలను బయటపెట్టిన జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు, ఈ మధ్య కాలం లో జరిగిన ఆంధ్రజ్యోతి విలేకరు పై జరిగిన ఘటన దేశాన్ని కుదిపేశాయి. కర్ణాటక, తమిళనాడులో రాజకీయ ఒత్తిడులు, కేసుల ద్వారా జర్నలిస్టులను మౌనం పాటించేలా చేసే ప్రయత్నాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సంఘటనలన్నీ కలిపి చూస్తే, దేశంలో మీడియా స్వేచ్ఛ క్రమంగా సంకుచితమవుతోందన్న స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. మీడియా నిపుణులు, న్యాయవేత్తలు, ప్రజాస్వామ్య విశ్లేషకులు ఒకే మాట చెబుతున్నారు. జర్నలిస్టులపై దాడులు పెరగడం అంటే ప్రజాస్వామ్యం బలహీనపడుతున్న సంకేతం. ప్రజలకు నిజాలు తెలియకుండా చేయాలనే ప్రయత్నం ఎక్కడైనా ప్రారంభమైతే, అక్కడ అవినీతి, అక్రమాలు మరింతగా పెరుగుతాయి. నిజాన్ని వెలుగులోకి తీసుకురావాల్సిన వర్గం భయంతో వెనక్కి తగ్గితే, అది సమాజానికి దీర్ఘకాలిక నష్టం కలిగిస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వాల పాత్ర అత్యంత కీలకం. అయితే అనేక సందర్భాల్లో అధికార యంత్రాంగం తక్షణం స్పందించకపోవడం, దాడులపై గట్టి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. “మౌనం ఇప్పుడు సహకారం లాంటిదే” అనే వ్యాఖ్యలు సామాజిక వర్గాల్లో వినిపిస్తున్నాయి. దాడులకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి, కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే, అది నేరస్తులకు ప్రోత్సాహం ఇచ్చినట్టే అవుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంస్థలు, పౌర సమాజం ఒకే స్వరంతో ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్నాయి. జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి, వేగవంతమైన విచారణ ద్వారా కఠిన శిక్షలు విధించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక చట్టాలు, రక్షణ మార్గదర్శకాలు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ప్రతి దాడిని సీరియస్‌గా తీసుకుని, బాధితులకు తక్షణ రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ప్రజల నుంచీ కూడా ఇదే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. జర్నలిస్టులు సురక్షితంగా పనిచేయగలిగితేనే సమాజానికి నిజాలు తెలుస్తాయని, లేకపోతే ప్రజాస్వామ్యం పేరుకే మిగిలిపోతుందని పౌరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాడులను ఖండించడం మాత్రమే కాకుండా, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు ఒత్తిడి కొనసాగించాలని వారు భావిస్తున్నారు. జర్నలిజం కేవలం ఒక వృత్తి కాదు అది ప్రజల హక్కులను కాపాడే ప్రధాన స్తంభం. ఆ స్తంభంపై దాడులు జరుగుతున్నప్పుడు ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉండటం, పరిస్థితిని మరింత విషమంగా మారుస్తుంది. కాబట్టి ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణించి, స్పష్టమైన చర్యలతో ముందుకు రావాల్సిన సమయం వచ్చింది. లేకపోతే “నిజం చెప్పడం” ఒక ప్రమాదకర చర్యగా మారే రోజులు దూరంలో ఉండవు. జర్నలిజాన్ని రక్షించడం అంటే ప్రజాస్వామ్యాన్ని రక్షించడం, ఈ నిజాన్ని గుర్తించి, వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని దేశవ్యాప్తంగా డిమాండ్ ఉవ్వెత్తున ఎగిసిపడుతోంది.

## కుందాలపల్లిలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహా ప్రతిష్ట

### *ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కొత్తపేట జనసేన ఇన్చార్జి బండారు శ్రీనివాసరావు*





**పి. గన్నవరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 29**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం మండలం కుందాలపల్లి గ్రామంలో నూతనంగా ప్రతిష్టించిన శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహా ప్రతిష్ట మహోత్సవంలో పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీ అభయాంజనేయ స్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ మహోత్సవం ఎంతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ శాసనసభ్యులు బండారు సత్యనారాయణ రావు,బండారు శ్రీనివాసరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కాకినాడలో కారుణ్య నియామకం



**కాకినాడ(సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 29**

కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో కారుణ్య ప్రాతిపదికన నియామకం జరిగింది. వైద్యపరమైన అనారోగ్యం కారణంగా పదవీ విరమణ చేసిన శానిటరీ మైస్త్రీ ఎం.డి. హుస్సేన్ ఖాన్ కుమారుడు మహమ్మద్ సాదిక్ ఖాన్‌ను 'జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్'గా నియమిస్తూ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు, కారుణ్య నియామకాల కమిటీ సిఫార్సుల ఆధారంగా ఖాళీ ఉన్న పోస్టుకు ఆయనను తాత్కాలిక ప్రాతిపదికన నియమించారు. నియామక పత్రాన్ని బుధవారం కమిషనర్ సత్యనారాయణ స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ జనరల్ సెక్షన్ సూపరింటెంట్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో ఆయుష్ హాస్పిటల్ తక్షణమే ప్రారంభించాలి



**కాకినాడ,(సిటిజన్ టైమ్స్) ఏప్రిల్ 29**

కార్మిక వర్గం మేడే ఘనంగా నిర్వహిస్తూ సామ్రాజ్యవాద యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకించాలని సిపిఎం కాకినాడ నగర కమిటీ పిలుపు ఇచ్చింది. సిపిఎం నగర కమిటీ సమావేశం కె. సత్తిరాజు అధ్యక్షతన సుందరయ్య భవన్ లో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులు కాలరాస్తున్న నేపథ్యంలో మేడే మరింత ఘనంగా నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో కాకినాడ లో నిర్మించిన ఆయుష్ హాస్పిటల్ తక్షణమే ప్రారంభించాలని, హాస్పిటల్ ప్రక్కనే ఆయుర్వేద కళాశాల నిర్మించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జిజిహెచ్ లో సెక్యూరిటీ గార్డ్స్ గత నెల రోజులుగా పైగా ఆందోళన చేస్తున్నారని, సంబంధిత అధికారులు చొరవచూపి సెక్యూరిటీ గార్డ్స్ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతున్నామన్నారు. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ మత్స్యకారులకు వేట నిషేధ కాల పరిహారం తక్షణమే అందించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అదేవిధంగా మే 19 సుందరయ్య వర్థంతి ఘనంగా నిర్వహించాలని, నగరంలో సమస్యలపై దశలవారీగా ఆందోళన చేపట్టాలని తీర్మానం చేసారు. ఈ సమావేశంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, దుంపల ప్రసాద్, సిహెచ్. వేణు, కె. నాగజ్యోతి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మే 1న బీసీ రిజర్వేషన్ కోటపై వినతుల స్వీకారం

## జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 29**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లోబి.సి రిజర్వేషన్ కోటాపై వినతులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బి. సి రిజర్వేషన్ కోటాకు సంబంధించి వివిధ సంఘాలు, ప్రజా ప్రతినిధులు ప్రజల నుంచి అభిప్రాయాలు, వినతులను స్వీకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ నోటి ఫికేషన్ జారీ చేసిందన్నారు.ఈ కమిషన్ కు విశ్రాంతి అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా అధ్యక్షత వహిస్తారని ఆయన వెల్లడించారు బి.సి వర్గాలకు సంబంధించిన సంఘాలు లేదా అవగాహన కలిగిన వ్యక్తులు తమ అభిప్రాయాలు సూచనలు వినతి పత్రం రూపం లో సంబంధిత ఆధారాలతో సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. మే 4 న కమిషన్ అధ్యక్షుల పర్యటన ఉంటుందన్నారు. కమిషన్ అధ్యక్షులు రాజీవ్ రంజన్ మిశ్రా మే 4 న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రాజమహేంద్రవరం ఆర్ అండ్ బి అతిథి గృహములో గల సమావేశపు మందిరములో జైలు రోడ్డు నందు బి.సి సంఘాలు, ప్రజా ప్రతినిధులు, సాధారణ ప్రజలతో సమావేశమై అభిప్రాయాలు, సూచనలు,వినతి పత్రాలు స్వీకరించనున్నారని జిల్లా కలెక్టర్, ఆర్.మహేష్ కుమార్ ప్రకటనలో తెలిపారు. కావున వినతి పత్రాలు సమర్పించాల్సిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# మద్యం షాప్ ముసుగులో అక్రమ సిట్టింగ్ నడుపుడుతున్న వైన్స్ యజమానులు

## చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ -ఎన్నోసార్లు ఆరోపణలు చేసిన పట్టించుకోని వైనం







**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఏప్రిల్ 29**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో వైన్స్ షాప్స్ ఆగడాలకు అంతులేకుండా పోయిందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైన్స్ షాప్స్ యజమానులు ఏకంగా బార్ అండ్ రెస్టారెంట్స్ తీరులో వైన్స్ పక్కనే సిట్టింగ్స్ ఏర్పాటుచేసుకుని విచ్చలవిడిగా మద్యం మరియు అపరిశుభ్రమైన ఆహారం విక్రయిస్తున్నారు. ప్రధాన రహదారికి సమీపంలో వాహనాలు నిలిపి వందల సంఖ్యలో మద్యం ప్రియులను కూర్చోబెట్టి వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఇంత జరుగుతున్న ఎక్సైజ్ అధికారులు ఫుడ్ ఇన్స్ పెక్టర్ కనీస తనిఖీలు చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాసిరకం తిండి పదార్థాలను విక్రయాయిస్తున్న మరియు అక్రమంగా పర్మిట్ రూమ్ సిట్టింగ్ నిర్వహిస్తున్న వైన్స్ షాపు లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వీరు చేస్తున్న అక్రమ వ్యాపారం వలన బార్ లకు నష్టం వాటిల్లుతుందని బార్ యజమానులు వాపోతున్నారు. ప్రతి వైన్స్ షాప్స్ లో కచ్చితంగా అమలుచేయాల్సిన నిబంధనలు ఉల్లంఘిస్తూ ఈ వ్యాపారం నిర్వహిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈల చేయడం వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లుతుందని అంటున్నారు గతంలో నాసిరకం మద్యం అమ్మకాలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి కాబట్టి ఈ విషయంలో అధికారులు జోక్యం చేసుకోని వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఎన్ని సార్లు పత్రికల్లో కథనాలు వచ్చినా ఎక్సైజ్ అధికారులు నిమక్కు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు కానీ ఈ విషయంలో చర్యలు తీసుకొని పక్షంలో రాష్ట స్థాయిలో ఉన్న అధికార్లకు కూడా ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంటుందని ప్రజలు అంటున్నారు.

# నేరాల నియంత్రణ, మహిళా భద్రతపై జిల్లా ఎస్పీ

## జి. బిందు మాధవ్, కీలక ఆదేశాలు



**కాకినాడ (సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 29**

కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్, అధ్యక్షతన జిల్లా నేర సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి సబ్ డివిజనల్ పోలీస్ అధికారులు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, స్టేషన్ హౌస్ అధికారులు మరియు ఇతర సంబంధిత అధికారులు హాజరయ్యారు. సమావేశంలో ప్రాపర్టీ నేరాలు, మహిళలు మరియు చిన్నారులపై జరిగే నేరాలు, పెండింగ్ కేసుల స్థితిగతులను సమగ్రంగా సమీక్షించి, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిర్దిష్ట కాలపరిమితిలో చార్జ్ షీట్లు దాఖలు చేయాలని ఎస్పీ ఆదేశించారు. మహిళలు మరియు చిన్నారులపై నేరాల విషయంలో ప్రత్యేక దృష్టి సారించి, అలాంటి కేసులను సున్నితంగా తీసుకుని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు మరియు సమస్యాత్మక ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వారెంట్లు, సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు అమలు పురోగతిని సమీక్షించి, ఈ విషయంలో పనితీరును మెరుగుపరచాలని పేర్కొన్నారు. అదేవిధంగా హిస్టరీ షీటర్లు మరియు అలవాటు పడిన నేరస్థులపై కఠిన నిఘా కొనసాగించాలని, వాహన తనిఖీలు, నైట్ పెట్రోలింగ్ మరియు కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించి అక్రమ కార్యకలాపాలను అరికట్టాలని సూచించారు. పోలీస్ ఆన్లైన్ అప్లికేషన్స్ ఉపయోగించడం ద్వారా స్మార్ట్ పోలీసింగ్ లో మన జిల్లా ముందుండాలని సూచించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు దర్యాపులో ఎలాంటి అలసత్వం వహించరాదని ఎస్పీ స్టేషన్ ఎస్ ఎచ్ ఓ లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఏఎస్పీ పాటిల్ దేవ్ రాజ్ మనీష్, ఐపీఎస్, ఎస్బి డిఎస్పీ కెవివి సత్యనారాయణ, జిల్లాలోని సిఐలు, ఎస్సైలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. చివరగా కేసుల పరిష్కారంలో కృషి చేసిన అధికారులకు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేశారు.

# జిఎంసి బాలయోగి ఆశయాలు నెరవేరుస్తా

## తండ్రి బాటలో తనయుడు ఎంపీ హరీష్ మాధుర్

## కొండుకుదురు గ్రామాభివృద్ధికి కృషి -అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్



**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 29**



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలం కొండుకుదురు గ్రామంలో వేంచేసియున్న గ్రామ దేవత శ్రీ ఆర్ల ఆక్కమ్మ తల్లి ని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ మంగళవారం దర్శించుకున్నారు. ఆయన కు కొండుకుదురు తాజా మాజీ సర్పంచ్ మేడిద దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి ,శ్రీ ఆర్లక్కమ్మ తల్లి ని దర్శించుకోవడం తనకు ఆనందంగా ఉందని, తన తండ్రి భారత దేశ లోక్ సభ స్పీకర్ దివంగత గంటి మోహన్ చంద్ర బాలయోగి హయాంలో అమ్మవారిని దర్శించుకోవడం జరిగిందని, తన తండ్రి ఆశయాలు నెరవేర్చేందుకు కృషి చేస్తానని, కొండుకుదురు గ్రామం లో మౌలిక సదుపాయాలు కల్పించి, శ్రీ ఆర్లక్కమ్మ తల్లి ప్రాంగణంలో సరికొత్త రహదారుల నిర్మించి కొండుకుదురు గ్రామస్తుల వినతిని వచ్చే సంవత్సరం నాటికి తప్పనిసరిగా అమలు చేస్తానని అన్నారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జనసేన, బిజెపి, కూటమి నాయకులు అమ్మవారిని దర్శించుకోవడం జరిగిందని, శ్రీ ఆర్లక్కమ్మ తల్లి ఆశీస్సులు అందరికీ కలుగజేయాలని అన్నారు. శ్రీ ఆర్లక్కమ్మ తల్లి ని,లక్షలాదిమంది దర్శించుకోవడం ఆనందదాయకమని అన్నారు. అనంతరం అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# దివంగత మాజీ ఎమ్మెల్యే చిట్టబ్బాయ్ వర్ధంతి వేడుకలు

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 29**

నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కుడుపూడి చిట్టబ్బాయి 5వ వర్ధంతి సందర్భంగా హైస్కూల్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అమలాపురం అసెంబ్లీ కో-ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ ,వైయస్ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు , ఎస్ఈసీ మెంబర్ కుడుపూడి భరత్ , గొవ్వల రాజేష్ , చెల్లుబోయిన నాని, బాపూజీ, ఇళ్ల శేషారావు , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జరిమానా



**అద్దంకి (సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 29**

అద్దంకి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అద్దంకి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ. సుబ్బరాజు ఆధ్వర్యంలో జరిపిన తనిఖీల్లో ఈ ముగ్గురు పట్టుబడ్డారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం అద్దంకి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయమూర్తి కుమారి ఎం.వి సుబ్బమ్మ ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం మద్యం తాగి వాహనం నడిపి నందుకు గాను ఒకరికి రూ.4000, మిగిలిన ఇద్దరికి ఒక్కొక్కరికి రూ. 3000 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అద్దంకి సీఐ సుబ్బరాజు హెచ్చరించారు.

# పూరేటిపల్లిలో మహిళపై దాడికేసు నిందితునికి కోర్టు జరిమానా

**గుడ్లూరు, (సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 29**

మండలంలోని పూరేటిపల్లి గ్రామపరిధిలో 2023 సంవత్సరంలో జరిగిన మహిళపై దాడి కేసులో నిందితునికి కోర్టు జరిమానా విధించిందని స్థానిక ఎస్సై వి.వెంకట్రావు బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం పూరేటిపల్లి గ్రామానికి చెందిన రూపినేని సుశీల అనే మహిళపై గణిపినేని వెంకటేశ్వర్లు అనే వ్యక్తి కాళ్లతో, చేతులతో దాడి చేసిన ఘటనపై అప్పటి ఎస్సై కె.ప్రసాద్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు అనంతరం నిందితుడిపై కందుకూరు కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారన్నారు. ఈ కేసులో బాధితురాలి తరపున ఏపీపీ డీ.వరకుమారి వాదనలు వినిపించగా, అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎన్ నిఖిల్ రెడ్డి ఇరువురి వాదనలు పరిశీలించారు. విచారణలో నిందితుడు చేసిన నేరం రుజువు కావడంతో, కోర్టు నిందితునికి రూ. 1,000/- జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిందని ఎస్సై వెంకట్రావు తెలియజేశారు.

# సింగరకొండ హనుమజ్జయంతి వాల్ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి



**అద్దంకి (సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 29**

ప్రకాశం జిల్లా, అద్దంకి మండలం, సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో మే 9 నుంచి 14 వ తేదీ వరకు జరగనున్న హనుమజ్జయంతి ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ ఆవిష్కరించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. ?ఈ వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి అధ్యక్షుడు చుండూరి. మురళీ సుధాకర్ రావు, అసిస్టెంట్ కమిషనర్ మదమంచి. తిమ్మనాయుడు పాల్గొన్నారు. అలాగే పాలకమండలి సభ్యులు ఆకుల. కోటేశ్వరమ్మ, కోటేశ్వరరావు. మద్దా. సునీత, ఆంజనేయులు. ఏల్చూరి. వెంకటనారాయణమ్మ, గోపి. అరబోలు.నాగమ్మ, దేవరపల్లి సురేష్ బాబు, దూళిపాళ్ల. వెంకటరత్నం, బత్తుల. చంద్రశేఖర్, నూతి. లక్ష్మి ప్రసాదు. గొర్రెపాటి. పద్మజ, స్థానిక టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

## సేంద్రీయ వ్యవసాయం ప్రోత్సహించాలి -జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్






**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 29**

వ్యవసాయ రంగంలో రసాయన ఎరువుల వినియోగాన్ని, ముఖ్యంగా యూరియా వాడకాన్ని గణనీయంగా తగ్గించి, సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ నందు నిర్వహించిన జిల్లా స్థాయి యూరియా సమ స్యలు పీఎండిఎస్ ప్రోత్సాహకాలపై వ్యవసాయ ఉద్యాన సేర్ప్ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ జిల్లాస్థాయిలో యూరియా వినియోగ సమస్యలను తగ్గిస్తూ సేంద్రియ,సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. ప్రతి మండలంలో వరి సాగు ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ (పి ఎం డి ఎస్ ) అమల్లో తెచ్చేందుకు వీలుగా కిట్స్ సరఫరాకు సంబంధించి నివేదికలు రెండు రోజులలో సమర్పించాలని ఆదేశించారు. రైతాంగం అభీష్టానికి అనుగుణంగా కిట్స్ అందించి నవధాన్యాల సాగు ద్వారా భూసారాన్ని పెంచుకోవాలన్నారు. అదేవిధంగా వరి సాగు విధానంలో ప్రస్తుతం వినియోగిస్తున్న యూరియా వినియోగంలో 25% తగ్గించే దిశగా నానో యూరియాను ప్రోత్సహించాలన్నారు. తదుపరి వరి వంగ డాల రకాలను తరచుగా మారుస్తూ పంట వైవిధ్యా న్ని పెంచుతూ భూసారాన్ని కాపాడుకోవాలన్నారు. కమ్యూనిటీ మేనేజ్మెంట్ సహజసిద్ధ వ్యవసాయాన్ని జిల్లా వ్యాప్తంగా 40 శాతం విస్తీర్ణంలో ప్రోత్సహించాలన్నారు. మే 20 నాటికి రబీ కోతలు పూర్తవుతాయని ఈ లోపు గణాంకాలు రూపొందించి సమర్థిస్తే సర్ప్ ద్వారా రుణాలు కల్పించి పీఎండీఎస్ కిట్లను రైతుల అభీష్టానికి అను గుణంగా పంపిణీకి సన్నద్ధం కావాలన్నారు. కోతలకు ముందే భూమిలో తేమ ఉన్నప్పుడు నవ ధాన్యాలను చల్లుతూ పి ఎం డి ఎస్ సాగును చేపట్టాలన్నారు. పీఎండిఎస్ భూమిని సంవత్సరం పొడవునా పంట కవరుతో ఉంచి మట్టిలో సేంద్రీ య కార్బన్, తేమ నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. అధిక యూరియా వినియోగం వల్ల భూసారం దెబ్బతినడం, సాగు వ్యయం పెరగడం, దీర్ఘకాలంలో దిగుబడుల నాణ్యతపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున రైతులను సమతుల్య ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయ పద్ధతుల వైపు మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ (పిఎం డి ఎస్ )ద్వారా వర్షా కాలం ప్రారంభానికి ముందే విత్తనాలను సిద్ధం చేసి, భూమిని ఖాళీగా ఉంచ కుండా పంట కవరుతో కొనసాగించడం సాధ్య మవుతుందన్నారు. ఈ విధానం మట్టిలో సూక్ష్మ జీవుల కార్యకలాపాలను రక్షించడం, భూసారాన్ని పెంచుతుందన్నారు. పంట వైవిధ్యం భూస్థారాన్ని పెంచడమే కాకుండా, నత్రజని స్థిరీకరణ, తేమ నిల్వ, పశువులకు మేత, రైతు కుటుంబాలకు పోషకాహార వైవిధ్యం, పురుగు సమస్యల తగ్గుదల వంటి లాభాలను అందిస్తుందన్నారు .ప్యాకేజీ రూపంలో విత్తన కిట్లు, స్థానిక జీవామృతం/ఘన జీవామృతం వంటి సహజ వ్యవసాయ ఇన్పుట్ల అందుబాటు, రైతు సమాఖ్యలు, మహిళా సంఘాల భాగస్వామ్యంతో గ్రామస్థాయిలో ప్రచారం బలోపేతం చేయాలని సూచించారు. పిఎండిఎస్ కోసం 15 రకాల విత్తనాల కిట్లు జిల్లాలో అందించి, మిశ్రమ పంటలను ప్రోత్సహించాలన్నారు. రైతులకు తక్కువ వ్యయం, మెరుగైన నేల ఆరోగ్యం, వర్షా ధార పరిస్థితుల్లో మెరుగైన స్థైర్యం, సురక్షిత ఆహార ఉత్పత్తి లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు సమన్వయం తో పని చేయాలని ఆదేశించారు. భూసారం దెబ్బతినకుండా ఉండాలంటే రైతులు మోతాదుకు మించి యూరియా వాడకూడదనీ దీనివల్ల పెట్టుబడి ఖర్చు పెరగడమే కాకుండా పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందన్నారు. ?రసాయన ఎరువులకు బదులుగా నానో యూరియా, సేంద్రీయ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువుల వాడకంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగా హన కల్పించాలని ఆదేశించారు.?భవిష్యత్ తరాలకు ఆరోగ్య కరమైన ఆహారాన్ని, సారవంత మైన భూమిని అందించాలంటే మనం మళ్లీ ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లక తప్పదన్నారు. జిల్లాలోని రైతులందరూ ఈ మార్పులో భాగస్వాము లు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ వి రామారావు, డిఆర్డిఏ పిడి డి రాంబాబు, న్యాచురల్ ఫామింగ్ డి పి ఎం శ్రీనివాస్ డీపీఎంలు ఎంఏవోలు తదితరులు పాల్గొన్నారు.

# నేటి వరకు ఆస్తి పన్ను పై రాయితీ

## సద్వినియోగం చేసుకోవాలి

## మున్సిపల్ కమిషనర్ రమణ బాబు



**గిద్దలూరు (సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 29**

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన ఇంటి పన్ను ముందస్తు చెల్లింపుపై 5శాతం రాయితీ , ఇంటి పన్ను పాత బకాయిలు మొత్తం ఒకేసారి చెల్లింపుపై వడ్డీ లోని 50శాతం రాయితీ రేపటితో ముగుస్తుందని. గిద్దలూరు పట్టణ ప్రజలు ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకొని పట్టణ ప్రగతికి తోడ్పడాలని కమీషనర్ రమణ బాబు ఒక ప్రకటనలో కోరారు. పన్ను చెల్లింపు దారుల కొరకు గిద్దలూరు పురపాలక సంఘం కార్యాలయంలో పన్ను చెల్లింపు కౌంటర్ గురువారం రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటుందని. పట్టణ ప్రజలు గమనించి పన్ను బకాయిలు చెల్లించాలని కోరారు.

# ఉచిత రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీడీవో టి యల్ ప్రసూనాదేవి





**పెద్ద దోర్నాల (సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 29**

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయములో బుధవారంఎంపీడీవో మరియు తహసిల్దార్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించిన వైద్యులు బృందం సహాయంతో 20 మంది రక్తదానం ఇవ్వటం జరిగింది. రక్తదానం అనేది ప్రాణదానంతో సమానం అనారోగ్యంతో ప్రాణాపాయములో ఉన్నవారికి రక్తదానం చేయటం వల్ల వాళ్ళ ప్రాణాలను కాపాడవచ్చు ఆరోగ్యంగా ఉన్న వాళ్ళు ఎవరైనా ప్రతి మూడు లేదా నాలుగు నెలలకి ఒకసారి రక్తదానం చేయొచ్చు ఎవరైనా రక్తదానం చేయదలచినటువంటి వాళ్ళు దోర్నాల గవర్నమెంట్ హాస్పటల్ లోని రక్త కేంద్రానికి వచ్చి రక్తదానం ఇవ్వాల్సిందిగా కోరుచున్నామని చింతల ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి. హబీబ్ ఖాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అశోక్ కుమార్ రెడ్డి, ఏవో పద్మనామరెడ్డి,ఎస్ శ్రావణ్ కుమార్ శర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సచివాలయ సేవలు, పనితీరును మరింత మెరుగు పరుచుకోవాలి..

*-వాట్సాప్ గవర్నమెంట్ పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి..*

*- అన్ని మండలాల ఎంపీడీవోలు,*

*క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టం చేసిన జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్..*





**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 29**

ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించడం జవాబుదారితనంలో జిల్లాలోని సచివాలయాలు పనితీరు మరింత మెరుగుపరుచుకోవాలని, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ శాఖల కింద చేపట్టిన పనులనులలో పురోగతి కనబరచాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్.. జిల్లా ప్రజా పరిషత్, డ్వామా, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో కలిసి అన్ని మండలాల ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈలు ఇతర ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు వ్యవస్థల బలోపేతం చేయడం, జలధార - జలహారతి కార్యక్రమం కింద గుర్తించిన పనుల వివరాలు, ఆర్డబ్ల్యూఎస్ శాఖ ద్వారా మంచినీరు ట్యాంకులకు క్లోరినేషన్ చేయించడం, పల్లే పండుగ కార్యక్రమం కింద చేపట్టిన పనులు వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. వివిధ ప్రభుత్వ సేవలు నిమిత్తం గ్రామ సచివాలయానికి వచ్చే ప్రజలతో సచివాలయం సిబ్బంది ప్రవర్తన, పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రజలలో సచివాలయాల పనులు తీరు పట్ల మంచి స్పందన తీసుకురావాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వాట్సప్ గవర్నమెంట్ పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని , సచివాలయం కొచ్చిన ప్రజల చేత నేరుగా వారి మొబైల్ లోనే వారికి అవసరమైన సేవలు దరఖాస్తు చేయించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు వ్యవస్థలు మరింత మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు మండలస్థాయి అధికారులు పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ తాగు నీరు సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జలధార - జలహారతి కార్యక్రమం కింద గుర్తించిన పనులను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు వెంటనే తనిఖీ చేసి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. గ్రామీణ నీటి సరఫరా శాఖకు సంబంధించి అన్ని మంచినీరు ట్యాంకులకు ప్రతి 15 రోజులకు సక్రమంగా క్లోరినేషన్ జరిగేలా చూడాలన్నారు.ఈ క్లోరినేషన్ వివరాలను ఎప్పటికప్పుడు యాప్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమం కింద చేపట్టిన సీసీ డ్రైన్లు, రోడ్లు, కాంపౌండ్ వాల్స్, బిటి రోడ్లు నిర్మాణం పనులలో బుడగట్టు కనపరచాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్, హెల్త్ క్లినిక్స్ నిర్మాణాలు త్వరత్వేత్తిన పూర్తి చేయాలని జిల్లా ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, డ్వామా పీడీ ఎస్ మధుసూదన్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎండీ మతిన్, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎవీఎస్ శ్రీనివాసరావు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుడ్లూరు ఎస్టీకాలనీలో పేకాటరాయుళ్లు అరెస్ట్



**గుడ్లూరు, (సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 29**

మండల కేంద్రమైన గుడ్లూరు ఎస్టీ కాలనీలో పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది ఎస్సై వి వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం ఎస్టీ కాలనీలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో ఎస్సై తన సిబ్బందితో వెళ్లి పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోనే తీసుకొని అదుపులోనికి తీసుకొని వారి వద్ద ఉన్న 2640/- రూపాయల నగదును, ఒక ద్విచక్ర వాహనాన్ని, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పడుతున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలియజేశారు.

# డీజిల్ సరఫరా స్థితిగతులపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

## జిల్లాలో డీజిల్ పెట్రోల్ కొరత లేదు -జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్





**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 29**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలపై ఆందోళన అవసరం లేదని ఎవరూ ప్యానిక్ అవ్వ వద్దని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. బుధవారం ఆయిల్ కంపెనీల సేల్స్ అధికారులు తాసిల్దార్లు పౌరసరఫరాల డీటీలు తో వీడియో కాన్ఫ రెన్స్ సమావేశం నిర్వహించి డీజిల్ సరఫరా స్థితిగతులపై సమీక్షించారు.జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత ఏమాత్రం లేదని, తగినన్ని నిల్వలు అందు బాటులో ఉన్నాయన్నారు. రోజువా రీగా జిల్లాకు డీజిల్ తీసు కుని వచ్చేలారీలు సంఖ్య పెరగడంతో పాటు డీజిల్ విక్రయాలు సాధారణ స్థితి చేరుకుంటున్నాయన్నారు. ఒక నయారా కంపెనీకి సంబంధించి ఆయిల్ రవాణా చేసే వాహనాల సంఖ్య తక్కువగా ఉండడంతో సరఫరా విషయంలో కొంత జాప్యం ఉందని ఆయన స్పష్టం చేశారు. డీజిల్ విక్రయాలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయన్నారు. పెట్రోల్, డీజిల్ స్టాక్ ద ఆందోళనతో వాహనదారులు ఒకేసారి పెద్ద మొత్తంలో ఫ్యానిక్ కొనుగోలు చేసి విల్వ చేయవద్దని జిల్లా జిల్లా కలెక్టర్ సూచించారు. బంక్ అవుట్ లెట్ల నందు స్టాక్ ఉండి వినియోగదారులకు సరఫరా చేయకుంటే సంబంధిత బంకులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోశీ నిధియా దేవి హెచ్చ రించారు. బల్క్ వినియోగం పై దృష్టి పెట్టాలని అక్రమ నిల్వలు చేయడం చట్ట విరుద్ధమని దీనిపై నిఘా ఉంచాలని తహశీల్దార్లకు, పోలీసులకు సిఎస్ డి టి ల ఆదేశాలు జారీ చేశారు ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే నిత్యవసర వస్తువుల చట్టాల కింద కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో డీజిల్ అవసరాలు డిమాండ్ కనుగుణంగా సరఫరాను పునరుద్ధరించాలని, ఆయన కంపెనీల ప్రతినిధులకు సూచించారు.చమురు నిల్వలు తక్కువగా ఉన్న బంకులను గుర్తించి వెంటనే సమృద్ధిగా ఆయిల్ సరఫరా చేయాలని ఆదేశించారు. మొత్తం 110 బంకులు తెరిచి రెండు రోజులలో సాధారణ పరిస్థితులు పూర్తిస్థాయిలో నెలకొల్పాలని ఆయిల్ కంపెనీల ప్రతి నిధులకు సూచించారు. దశలవారీగా చమురు నిలవాలని పెంచుతూ డిమాండ్ ను చేరుకోవాలని సూచించారు. నయారా కంపెనీ ప్రతినిధిని జిల్లా కంట్రోల్ రూమ్ లో నియమించాలని సూచించారు. వరి కోతలు ఆక్వారంగా రేడియేటర్లకు అవసరమైన డీజిల్ సరఫరాకై తాసిల్దార్ లో నుండి గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ,మత్స్య సహాయకులు ద్వారా, కూపన్లను రోజువారీగా ఒకసారి మాత్రమే ఇవ్వడం జరుగుతుందని,వాటిని బంకులలో ఉన్న రెవెన్యూ సిబ్బంది నిశితంగా పరిశీలించి సరఫరాకై తగు చర్యలు చేపట్టాలన్నారు. సిబ్బంది ఎవరైనా అక్రమా లకు పాల్పడితే ఎంత మాత్రం ఉపేక్షించేది లేదని ఆమె హెచ్చరించారు. ప్రాధాన్యతగా క్రమంలో మాత్రమే డీజిల్ విక్రయాలు నిర్వహించాలని ఆమె స్పష్టం చేశారు. ప్రజా రవాణాకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. మండల తాసిల్దార్లు తెలిపిన బంకులలో చమురు నిల్వలను సమృద్ధిగా ఉంచి ఆయా ప్రాంత అవసరాలకు సరఫరా చేయాలన్నారు.ఆయిల్ కంపెనీల సేల్స్ అధికారులు ప్లాన్ అఫ్ యాక్షన్ ప్రకారం అన్ని బంకులను పున ప్రారంభించి జిల్లాలో ఉన్న డిమాండ్కు అనుగుణంగా డీజిల్ సరఫరా చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఎస్ఓ ఏ ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మేదరమెట్లలో వై.వి.సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు..

### మే 1న ఉచిత మెగా వైద్య శిబిరం.



**అద్దంకి (సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 29**

మాజీ టీటీడీ చైర్మన్, రాజ్యసభ సభ్యులు వై.వి. సుబ్బారెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన స్వగ్రామం కోరిశపాడు మండలం, మేదరమెట్లలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఒంగోలులోని ఎయిమ్స్ హాస్పిటల్ (అన్నా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆధ్వర్యంలో మే 1వ తేదీ, శుక్రవారం ఉదయం 8 గంటలకు ఈ శిబిరం ప్రారంభం కానుంది. మేదరమెట్లలోని స్థానిక చిత్రాలయం థియేటర్ పక్కన ఉన్న కళ్యాణ మండపం వద్ద ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మేదరమెట్ల మాజీ సర్పంచ్ జజ్జర. ఆనందరావు తెలిపారు. ?ఈ వైద్య శిబిరానికి అద్దంకి మాజీ ఏఎంసీ చైర్మన్ వై.వి. భద్రారెడ్డి, అద్దంకి వైఎస్సార్సీపీ ఇంచార్జ్ డాక్టర్. అశోక్ కుమార్ హాజరుకానున్నారు. ఈ శిబిరంలో రక్తపరీక్షలు, షుగరు, బి.పి పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు ఆనందరావు తెలిపారు. అద్దంకి నియోజకవర్గం, మేదరమెట్ల పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జజ్జర. ఆనందరావు కోరారు. శిబిరానికి వచ్చే వారికి భోజన సదుపాయం ఏర్పాటు చేశామన్నారు.

# మానసిక ప్రశాంతతకు యోగ ఎంతో అవసరం

### కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్



**సి ఎస్ పురం, (సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 29**

శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతకు ఆరోగ్యకరమైన జీవనశైలిని కాపాడుకోవడంలో యోగాసనాలు ఎంతో అవసరమని కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్ అన్నారు.కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా ఐదవ రోజు యోగా కార్యక్రమం ఎన్ ఎన్ ఎస్ ఇన్చార్జి అసిస్టెంట్ ప్రొఫెసర్ పి. స్టెఫి ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు, అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శారీరక, మానసిక శ్రేయస్సు కోసం వివిధ యోగాసనాలు,శ్వాస వ్యాయామాలు చేయడంలో ఫిజికల్ ట్రైనర్ రవీంద్ర బాబు విద్యార్థులకు అవగాహనా కలిపించారు.విద్యార్థులు వివిధ శారీరక సమస్యలను నియంత్రించడానికి ఉపయోగపడే పలు యోగాసనాలను ప్రదర్శించారు.

# సబ్ జైలును తనకీ చేసిన ప్రిన్సిపల్జూనియర్ సివిల్ జడ్జి



**గిద్దలూరు (సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 29**

గిద్దలూరు పట్టణంలోని సబ్ జైల్ ను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ. ఓంకార్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ప్రతి ఒక్కరి కేసుల వివరములను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి ఉండాలన్నారు, మద్యం త్రాగి మోటారు వాహనములు నడపటం నేరమన్నారు.బెయిల్ పొందిన వారు, సదరు కేసు పూర్తయ్యే వరకు, ప్రతి వాయిదాకు కోర్టు ముందు హాజరు కావాలన్నారు. సింగిల్ షూరిటీ అర్హులకు ఉచిత న్యాయ సహాయం గురించి తెలియజేశారు. నేరాలు చేయవద్దనని, కుటుంబ సభ్యుల భవిష్యత్తు గురించి ఆలోచించాలన్నారు. ఆవేశం అనర్థాయకమన్నారు. తదుపరి ఖైదీలకు అందిస్తున్న సదుపాయములను, సరుకుల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జైల్ ఇంచార్జ్ సూపరెండేంట్ రామకృష్ణ, లీగల్ ఎయిడ్ న్యాయవాది బి. సంధ్యారాణి పారా లీగల్ వాలంటీర్ అద్దంకి మధుసూధనరావు, జైల్ సిబ్బంది ఖైదీలు పాల్గొన్నారు.

# ఆలయాల ప్రతిష్ఠా మహోత్సవాల్లో పాల్గొన్న డాక్టర్. చింతలపూడి అశోక్ కుమార్..

**అద్దంకి (సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 29**

అద్దంకి నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో జరిగిన దేవాలయాల ప్రతిష్ఠా మహోత్సవాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్. చింతలపూడి అశోక్ కుమార్ దంపతులు బుధవారం పాల్గొన్నారు. పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**అమరలింగేశ్వర స్వామి ప్రతిష్ఠ.**

సంతమాగులూరు మండలం, అడవిపాలెం గ్రామంలో జరిగిన గంగా పార్వతి సమేత అమరలింగేశ్వర స్వామి దేవస్థాన ప్రతిష్ఠా మహోత్సవంలో డాక్టర్. చింతలపూడి అశోక్ కుమార్ దంపతులు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



**లక్ష్మీ చెన్నకేశవస్వామి ప్రతిష్ఠ..**

బల్లికురవ మండలం, ఉప్పుమాగులూరు గ్రామంలో నిర్వహించిన శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి ప్రతిష్ఠా మహోత్సవంలో



డాక్టర్. అశోక్ కుమార్ దంపతులు పాల్గొన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎండాకాలంలో ఆరోగ్య రక్షణకు అవగాహన కల్పించాలి -సిడిపిఓ షేక్ ఆశాబేగం



**సి ఎస్ పురం, (సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 29**

ఎండలు తీవ్రత పెరుగుతున్నందున అంగన్వాడి కేంద్రాల పరిధిలోని గర్భవతులు, బాలింతలు, చిన్నపిల్లలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అంగన్వాడి కార్యకర్తలకు సిడిపిఓ షేక్ ఆశాబేగం సూచించారు మండల కేంద్రంలోని సి ఎస్ పురం వడ్డేపాలెం అంగన్వాడి కేంద్రంలో బుధవారం సెక్టార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీడీపీఓ షేక్ ఆశాబేగం హాజరై అంగన్వాడి కార్యకర్తలు, సూపర్వైజర్లతో వేసవి కాలంలో చేపట్టాల్సిన జాగ్రత్త పై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా సిడిపిఓ షేక్ ఆశాబేగం మాట్లాడుతూ ఎండ బారిన పడకుండా ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నందున గర్భవతులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై మండలంలోని ప్రతి అంగన్వాడి కార్యకర్త ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాలకు వచ్చే మహిళలు, పిల్లలు ఎండబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అవసరమైతే తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. చిన్నారులకు అందించే పౌష్టికాహారం, గర్భిణీలు మరియు బాలింతలకు పంపిణీ చేసే పోషకాహార పదార్థాలను ఎలాంటి ఆలస్యం లేకుండా సకాలంలో అందించాలని ఆదేశించారు.వైద్య ఆరోగ్యశాఖ అందించే ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రతి కేంద్రంలో ముందస్తుగా అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఎండల కారణంగా అలసట, నీరసం, డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తిన సందర్భాల్లో వెంటనే ఓఆర్ఎస్ అందించి అవసరమైతే వైద్యసేవలకు తరలించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు కూడా వేసవి జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహించే ప్రతి కార్యక్రమము లబ్ధిదారుల వివరాలు పౌష్టికాహార పంపిణీ హాజరు తదితర అంశాలను ప్రభుత్వ యాప్ లో నమోదు చేయాలని, చిన్నారుల బరువు ఎత్తు క్రమం తప్పకుండా పరీక్షించి నమోదు చేయాలని అలాగే పిల్లల్లో పోషకాహార లోపం కనిపిస్తే వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని, అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చే ప్రతి కార్యక్రమంను కచ్చితంగా నిర్వహించాలని సూచించారు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు సెక్టార్ సమావేశంలో సెక్టర్ సూపర్వైజర్ దేవ కృపావరం, ప్రాజెక్టు కోఆర్డినేటర్ గంధం శామ్యూల్, యాక్టివ్ సూపర్వైజర్ సరళ రెడ్డి మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శిగా గునుపూడి భాస్కర్



**పొదిలి, (సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 29**

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శిగా గునుపూడి భాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మంగళగిరి లోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నాడు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం రాష్ట్ర నీటి సరఫరాల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో భాస్కర్ పాల్గొన్నారు. రాష్ట్రస్థాయిలో కీలకమైన పదవి భాస్కర్ కు రావడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

# విలేఖరి హత్యను ఖండిస్తూ పొదిలిలో జర్నలిస్టుల నిరసన ప్రదర్శన




**పొదిలి, (సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 29**

చిత్తూరు జిల్లా వీకోటలో జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి హత్యకు నిరసిస్తూ పొదిలిలో జర్నలిస్టులు నిరసన ప్రదర్శన జరిపారు. బుధవారం నాడు పట్టణంలోని విశ్వనాధపురం సెంటర్ నుండి జర్నలిస్టులు నినాదాలు చేసుకుంటూ ప్రదర్శన నిర్వహించారు. చిత్తూరు జిల్లాలోని వీకోటకు చెందిన జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డిని దారుణంగా హత్య చేసిన నిందితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. అనంతరం పొదిలి పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేష్ కుమార్, ఎస్ ఐ రాజేష్ లను కలసి వినతి పత్రం అందజేశారు. అలాగే మండల తహసిల్దార్ కార్యాలయం వరకు కూడా ప్రదర్శనగా వెళ్లి మండల తహసిల్దార్ ఎం వి కృష్ణారెడ్డి కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ ఛానల్స్ లకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

# త్రిసభ్య కమిటీ డైరెక్టర్‌గా కోనంగి వెంకటకొండయ్య ప్రమాణ స్వీకారం

### భారీగా తరలి వెళ్లిన టిడిపి నాయకులు



**సి ఎస్ పురం, (సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 29**

మండలంలోని వెంకటాయచెరువు గ్రామానికి చెందిన మండల టిడిపి క్లస్టర్ ఇంచార్జి కోనంగి వెంకటకొండయ్య జిల్లా గొర్రెల పెంపకం సహకార యూనియన్ త్రిసభ్య కమిటీ డైరెక్టర్ గా బుధవారం ఒంగోలులో జరిగిన ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లి ఆయనకు మద్దతు తెలుపుతూ అభినందనలు తెలిపారు.ప్రమాణ స్వీకార కార్యక్రమం అధికారుల సమక్షంలో జిల్లా గొర్రెల పెంపకం సహకార యూనియన్ చైర్మన్ కడియం మణికంఠ, కోనంగి వెంకటకొండయ్యతో పాటు డైరెక్టర్ ఏనుగంటి పద్మావతి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తదుపరి కోనంగి వెంకటకొండయ్యను శాలువాతో సత్కరించి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెల పెంపకం అనేక కుటుంబాలకు జీవనాధారమని, ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు సహకార సంఘాలు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. మండలంలోని గొర్రెల పెంపకదారులకు అవసరమైన సబ్సిడీలు, పశు వైద్య సేవలు, మేత సదుపాయాలు, రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు స్పందించిన డైరెక్టర్ కోనంగి వెంకటకొండయ్య గొర్రెల పెంపకం పశు పోషకుల సంక్షేమం కోసం కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సలహాలు సూచనలతో గొర్రెల పెంపకాన్ని మరింత అభివృద్ధి చేస్తానని, గొర్రెల పెంపకం రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు చేరేలా అధికారులతో మైమేకమై చర్యలు తీసుకుంటానని అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాలు సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, మండల సీనియర్ నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, అట్లూరి రామకృష్ణంరాజు, గుంటిమడుగు వెంకటరామరాజు, చావా సుబ్బయ్య, మండల ఐటీడీపీ అధ్యక్షులు చింతం నాగభూషణం, బంకా మాలకొండయ్య, దనెంకుల మాలకొండయ్య, యూనిట్ ఇన్చార్జి నన్నసాని వరలక్ష్మయ్య తదితరులు

# విద్యార్థులతో కళకళలాడుతున్న వేసవి విజ్ఞాన తరగతులు



**సి ఎస్ పురం, (సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 29**

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని సి ఎస్ పురం శాఖ గ్రంథాలయంలో గ్రంథపాలకుడు ఆళ్ల భాస్కర్ రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. రెండో రోజు బుధవారం ఉపాధ్యాయినీలు కె.సంజన స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వగా, ఇ. అనిత తెలుగు పదాలు, వ్యాకరణం, గుణింతాలు బోధించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు ఆళ్ల భాస్కర్ రావు మాట్లాడుతూ గ్రంథాలయంలో పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం పెంపొందించి ఉన్నత చదువులకు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతిరోజూ క్రమశిక్షణతో గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు ఆళ్ల భాస్కర్ రావు, కె సంజన, ఇ అనిత, సి హెచ్ భారతి , విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మేదరమెట్లలో ముమ్మరంగా ‘స్వచ్ఛ పథం’ కార్యక్రమం

**అద్దంకి (సిటిజన్ టైమ్స్)ఏప్రిల్ 29**

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ‘స్వచ్ఛ పథం’ కార్యక్రమంలో భాగంగా కొరిశపాడు మండలం, మేదరమెట్ల గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగాయి. ప్రతి బుధవారం రోడ్లను శుభ్రం చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

**రోడ్లు, డివైడర్ల శుభ్రం...**

మేదరమెట్లలోని అద్దంకి రోడ్డులో ఉన్న సెంటర్ డివైడర్లను పంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు. ఇతర గ్రామాల నుండి వచ్చిన శానిటేషన్ వర్కర్లను ఒక బృందంగా ఏర్పాటు చేసి ఈ పనులను వేగవంతంగా చేశారు. ప్రధానంగా మండల కేంద్రానికి, ఇతర గ్రామాలకు కనెక్టివిటీ ఉన్న రోడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్లను శుభ్రపరిచారు. స్వచ్ఛమైన గ్రామాలు, ఆరోగ్యవంతమైన ప్రజలు లక్ష్యంగా ఈ పారిశుధ్య




పనులు ముమ్మరంగా చేస్తున్నట్లు మేదరమెట్ల పిడిఓ లక్ష్మీకాంత్ తెలిపారు.

# సిద్ధు, మీను ఆదర్శం కాబోతున్నారా..?

ఒకప్పుడు సినిమాలతో పోల్చితే టీవీ షోలు, సీరియల్స్‌ను చాలా చిన్న చూపు చూసే వారు. కాలక్రమేనా సినిమాలకు ఏమాత్రం తక్కువ కాకుండా టీవీ షో లు, సీరియల్స్ నడిచాయి. సినిమాలతో ఏ స్థాయిలో నటీనటులకు గుర్తింపు దక్కిందో, దాదాపు అదే స్థాయిలో టీవీ షోలతో, సీరియల్స్ తో నటీనటులకు గుర్తింపు దక్కిన విషయం తెల్సిందే.



సియా గౌతమ్ చీర స్టైల్ ప్యూర్ గ్రేస్

ఇప్పుడు మళ్లీ టీవీల ప్రాభవం తగ్గినట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడు సినిమాలతో ఓటీటీ కంటెంట్ పోటీ పడుతోంది. థియేట్రికల్ రిలీజ్ అవుతున్న సినిమాలకు ఏమాత్రం తగ్గకుండా ఓటీటీ వెబ్ సిరీస్‌లు మంచి సక్సెస్‌ను దక్కించుకుని, అత్యధిక ప్రేక్షాభిమానంను సొంతం చేసుకుంటున్న విషయం మనం చూస్తూనే ఉన్నాం. అందుకే మెల్ల మెల్లగా సినిమా స్టార్స్ ఓటీటీ కంటెంట్ లో నటించడం, వెబ్ సిరీస్‌ల్లో నటించడం వంటివి చేస్తున్నారు.

**హాలీవుడ్‌లో వెబ్ సిరీస్‌ల జోరు....**

ఇప్పటికే హాలీవుడ్ స్టార్స్ సినిమాలు, వెబ్ సిరీస్‌లను సమానంగా చూస్తున్నారు. కానీ ఇండియాలో మాత్రం ఆ వ్యత్యాసం క్లియర్‌గా కనిపిస్తోంది. ఆ వ్యత్యాసం మెల్ల మెల్లగా తగ్గుతూ వస్తోంది. బాలీవుడ్‌కి చెందిన పలువురు స్టార్స్ ఇప్పటికే ఓటీటీ కంటెంట్‌లో నటించేందుకు రెడీ అయ్యారు. కొందరు ఇప్పటికే వెబ్ సిరీస్‌ల్లో నటించి మెప్పించిన విషయం తెల్సిందే. తెలుగు స్టార్ హీరో వెంకటేష్ సైతం వెబ్ సిరీస్‌లో కనిపించాడు. రానాతో కలిసి వెంకటేష్ రానా నాయుడు వెబ్ సిరీస్ లో నటించాడు. అయితే ఆ వెబ్ సిరీస్ పూర్తి స్థాయి తెలుగు సిరీస్ కాకపోవడంతో ప్రేక్షకులు పెద్దగా ఆధరించలేదు. అయితే ఇతర భాషల్లో రానా నాయుడు సిరీస్‌కి మంచి స్పందన దక్కింది. ఇప్పుడు ప్యూర్ తెలుగు వెబ్ సిరీస్ ఒకటి రాబోతుంది. తెలుగులో చాలా వెబ్ సిరీస్‌లు వచ్చాయి. కానీ





నోటెడ్ హీరో నటించబోతున్న వెబ్ సిరీస్ ఇదే కావడం విశేషం.

**సిద్దు జొన్నలగడ్డ హీరోగా వెబ్ సిరీస్...**

యంగ్ హీరో సిద్దు జొన్నలగడ్డ ప్రధాన పాత్రలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో ఒక వెబ్ సిరీస్ రూపొందబోతుంది. ఇప్పటికే స్టోరీ లైన్ రెడీ అయ్యింది. స్క్రిప్ట్ వర్క్ మొదలైంది. మరో వైపు ప్రీ ప్రొడక్షన్ వర్క్ సైతం జరుగుతోంది. ప్రముఖ దర్శకుడు వెంకీ అట్లూరి ఈ వెబ్ సిరీస్‌కి దర్శకత్వం వహించబోతున్నాడు. ఇప్పటి వరకు స్టార్ హీరోలతో సినిమాలను నిర్మించి పాపులర్ అయిన సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ ఇప్పుడు వెబ్ సిరీస్ నిర్మాణంలో అడుగు పెట్టడంతో చాలా మంది ఇతర పెద్ద నిర్మాతలకు నాగవంశీ ఆదర్శం కాబోతున్నాడనే టాక్ వినిపిస్తోంది. వెబ్ సిరీస్ అనగానే చిన్న చూపు ఉన్న వారు ఈ వెబ్ సిరీస్ వచ్చిన తర్వాత కచ్చితంగా తమ అభిప్రాయంను మార్చుకుంటారని, హిందీలో మాదిరిగా వెబ్ సిరీస్‌లకు ముందు ముందు టైం రాబోతుంది అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

**వెబ్ సిరీస్‌లో మీనాక్షి చౌదరి...**

ఈ భారీ వెబ్ సిరీస్‌లో సిద్దుకు జోడీగా హీరోయిన్ మీనాక్షి చౌదరి నటించబోతుంది. హీరోయిన్‌గా ఫుల్ బిజీగా ఉన్న మీనాక్షి చౌదరి ఇలా వెబ్ సిరీస్‌కు ఓకే చెప్పడం వల్ల చాలా పెద్ద సాహసం చేస్తుందని చెప్పాలి. ఎందుకంటే ఆఫర్లు తక్కువ ఉన్న వారు, పెద్దగా క్రేజ్ లేని వారు, కెరీర్ చివర్లో ఉన్న వారు మాత్రమే వెబ్ కంటెంట్ లో కనిపించేందుకు ఆసక్తి చూపిస్తూ ఉంటారు. ఇప్పుడు సిద్దు జొన్నలగడ్డ, మీనాక్షి చౌదరిలు వెబ్ సిరీస్‌లు నటిస్తున్న కారణంగా ఇండస్ట్రీలో ఇతర యంగ్ స్టార్స్‌కి వీళ్లు ఆదర్శం కాబోతున్నారు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ వెబ్ సిరీస్ హిట్ అయితే కచ్చితంగా ముందు ముందు యంగ్ హీరోలు వెబ్ సిరీస్‌ల వైపు చూసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. హీరోయిన్స్ సైతం పారితోషికం, ఇతర విషయాలు పక్కన పెట్టి నటిగా నిరూపించుకునేందుకు వెబ్ సిరీస్‌లకు కమిట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

కాంస్య బ్యూటీ కృతి సనన్ వెకేషన్ గోల్స్ సెట్ చేసింది



## వైభవ్ బ్యాటింగ్ అచ్చం సూపర్ థ్రిల్లర్ సినిమానే: బుడ్డోడిపై మాజీ క్రికెటర్ పుజారా ప్రశంసలు




ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19లో అదరగొడుతున్న యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీపై భారత మాజీ క్రికెటర్ ఛతేశ్వర పూజారా ప్రశంసల వర్షం కురిపించారు. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ అచ్చం సూపర్ థ్రిల్లర్ సినిమాలా ఉంటుందని కొనియాడారు. ఎంతటి గొప్ప బౌలర్?నైనా ఎలాంటి భయం లేకుండా అతడు ఎదుర్కొనే విధానం అద్భుతమని కితాబిచ్చారు. బౌలర్ ఎవరనే సంబంధం లేకుండా కేవలం బంతిని చూసి బలంగా కొట్టడమే అతని స్టైల్ అని చెప్పారు. వైభవ్ దూకుడుగా ఆడతాడని తెలిసిన ప్రత్యర్థులు అతడిని కట్టడి చేయడానికి ఇబ్బంది పడటం విశేషమన్నారు. వైభవ్ నిలకడ, పవర్‌ప్లేలో అతని నిర్భయమైన బ్యాటింగ్ ప్రత్యర్థులపై పై చేయి సాధించి జట్టు విజయానికి పునాదులు వేస్తుందని ప్రశంసించారు.

కాగా, ఐపీఎల్ 19లో భాగంగా మంగళవారం (ఏప్రిల్ 28) పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచులో రాజస్థాన్ రాయల్స్ ఘన విజయం సాధించింది. పంజాబ్ నిర్దేశించిన 223 పరుగుల లక్ష్యాన్ని మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే ఆర్ఆర్ ఛేధించింది. 223 పరుగుల విజయవంతమైన ఛేదనలో రాజస్థాన్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ తుఫాన్ ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 16 బంతుల్లో 43 పరుగులు చేసి ఛేజింగ్?లో ఆర్ఆర్?కు మంచి స్టార్ట్ అందించాడు. ఓవరాల్?గా కూడా ఈ సీజన్?లో

15 ఏళ్ల 15 వైభవ్ దుమ్మురేపుతున్నాడు. ఈ సీజన్?లో ఇప్పటి వరకు 8 మ్యాచులు ఆడిన ఈ చిచ్చర పిడుగు 238 స్ట్రైక్ రేట్, 44 సగటుతో 400 పరుగులు చేసి లీగ్?లో అత్యధిక రన్స్ చేసిన జాబితాలో తొలి స్థానంలో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం ఆరెంజ్ క్యాప్ ఈ 15 ఏళ్ల బుడ్డోడి దగ్గరే ఉండటం విశేషం. ఈ సీజన్ లో రాజస్థాన్ రాయల్స్ ఇప్పటి వరకు 9 మ్యాచులు ఆడి ఆరు విజయాలు, మూడు ఓటములతో పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతోంది. ఆర్ఆర్ విజయాల్లో వైభవ్ సూర్యవంశీది కీలక పాత్ర.

## భారత బౌలర్లంటే ద్వేషం.. పాకిస్థాన్ క్రికెటర్ తీవ్ర వ్యాఖ్యలు!

- భారత బౌలర్లంటే తనకు ద్వేషమని పాక్ క్రికెటర్ హసన్ నవాజ్ వ్యాఖ్య
- టీమిండియాతో ఆడేటప్పుడు ప్రత్యేక ప్రేరణ కలుగుతుందని వెల్లడి
- పాకిస్థాన్ సూపర్ లీగ్ సందర్భంగా ఓ ఛానెల్‌తో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు
- ఈ వ్యాఖ్యలపై ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల నుంచి ఆగ్రహం



పాకిస్థాన్ క్రికెటర్ హసన్ నవాజ్ చేసిన వ్యాఖ్యలు క్రికెట్ ప్రపంచంలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 2026 సందర్భంగా ఒక స్థానిక న్యూస్ ఛానెల్‌తో మాట్లాడుతూ, భారత బౌలర్ల పట్ల తనకున్న అభిప్రాయాన్ని వివాదాస్పద రీతిలో వ్యక్తం చేశాడు. అతని మాటలపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్వ్యూలో భాగంగా ఏ బౌలర్‌పై పరుగులు చేయడానికి ఇష్టపడతారని ప్రశ్నించగా, హసన్ నవాజ్ బదులిస్తూ.. "భారత్‌తో ఆడేటప్పుడు సహజంగానే అదనపు ప్రేరణ ఉంటుంది. వాళ్ల బౌలర్లపై దాడి చేయాలనే భావన కలుగుతుంది. నిజం చెప్పాలంటే వాళ్ల బౌలర్లందరినీ నేను ద్వేషిస్తాను. భవిష్యత్తులో అవకాశం వస్తే, కచ్చితంగా వాళ్ల బౌలింగ్‌పై దాడి చేయడానికి ప్రయత్నిస్తాం" అని సంచలన వ్యాఖ్యలు చేశాడు. అయితే, కేవలం బౌలర్ పేరు చూసి కాకుండా, మ్యాచ్ పరిస్థితిని బట్టి తన ఆటతీరు ఉంటుందని హసన్ నవాజ్ వివరించాడు. "అవసరమైన రన్ రేట్ 10, 12 లేదా 15 పరుగుల చొప్పున ఉన్నప్పుడు, బౌలర్ ఎవరనేది చూడకుండా పరుగులు చేయడానికి ప్రయత్నిస్తాం. అంతా మ్యాచ్‌పై ఆధారపడి ఉంటుంది" అని అన్నాడు.

భారత్, పాకిస్థాన్ మధ్య క్రికెట్ మైదానంలోనే కాకుండా వెలుపల కూడా తీవ్రమైన పోటీ ఉంటుంది. 2013 నుంచి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగనప్పటికీ, ఐసీసీ టోర్నమెంట్లలో మాత్రమే తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లలో భారత్‌దే స్పష్టమైన ఆధిపత్యం కొనసాగుతోంది. 2025లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన హసన్ నవాజ్, ఇప్పటివరకు 25 టీ20 మ్యాచ్‌లు ఆడి ఒక సెంచరీ (105 నాటౌట్), రెండు అర్ధసెంచరీలతో కలిపి 457 పరుగులు చేశాడు. అలాగే, 4 వన్డేలలో 56.50 సగటుతో 113 పరుగులు సాధించాడు. అతను చివరిసారిగా 2025 నవంబర్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ తరఫున ఆడాడు. పీఎస్ఎల్ 2026లో క్వెట్టా గ్లాడియేటర్స్ తరఫున 10 మ్యాచ్‌లలో 291 పరుగులు చేసినప్పటికీ, ఆ జట్టు కేవలం 3 విజయాలతో పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలో నిలిచి నిరాశపరిచింది.

## ముంబై ఇండియన్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య టఫ్ ఫైట్.. హెడ్ టూ హెడ్ రికార్డులు, పిచ్ రిపోర్ట్ ఇదే..!



ముంబై: ఐపీఎల్ 19లో భాగంగా బుధవారం (ఏప్రిల్ 29) ముంబై ఇండియన్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడనున్నాయి. ముంబైలోని వాంఖడే స్టేడియంలో రాత్రి 7.30 గంటలకు ఈ మ్యాచ్ స్టార్ట్ కానుంది. లీగ్‌లో వరుసగా విజయాలతో దూసుకుపోతున్న హైదరాబాద్?కు తమ సొంతగడ్డపై చెక్ పెట్టి గెలుపు బాట పట్టాలని ముంబై భావిస్తోంది. మరోవైపు.. గెలుపు జోష్‌లో ఉన్న సన్ రైజర్స్ హైదరాబాద్ ముంబైను చిత్తు చేసి ప్లే ఆఫ్స్ రేసులో మరింత ముందుకెళ్లాలని ఉవ్విళ్లూరుతోంది. హైదరాబాద్ కంటే ముంబై ఇండియన్స్?కు ఈ మ్యాచ్ ఎంతో కీలకం. ఒక రకంగా చెప్పాలంటే డూ ఆర్ డై మ్యాచ్ లాంటిదే. హైదరాబాద్?పై గెలిస్తేనే పాండ్య సేన ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంటాయి. లేదంటే ముంబై ఆ తర్వాత ఆడే ఆరు మ్యాచుల్లో ఆరు తప్పక గెలివాల్సిందే. లేదంటే లీగ్ దశ నుంచి ఇంటి ముఖం పడుతోంది. టోర్నీ ఫార్మాట్ ప్రకారం లీగ్ దశ ముగిసేసరికి పాయింట్స్ టేబుల్‌లో టాప్-4లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్ చేరుతాయి. ఒకవేళ హైదరాబాద్?పై ముంబై ఓడిపోతే ఆ తర్వాత ఆడే ఆరు మ్యాచులకు ఆరు గెలవాల్సిందే. అలాగైతేనే 8 విజయాలతో పాండ్య సేకు టాప్-4 బెర్త్ ఖరారు అవుతుంది. ఈ సీజన్?లో ముంబై ఇప్పటి వరకు ఏడు మ్యాచులు ఆడింది. అందులో కేవలం రెండింట్లో మాత్రమే గెలిచి ఐదు మ్యాచుల్లో ఓటమి పాలై పాయింట్ల పట్టికలో చివరి నుంచి రెండో స్థానంలో కొనసాగుతోంది.

**ముంబై, ఎస్ఆర్‌హెచ్ హెడ్-టు-హెడ్ రికార్డ్:**

ఈ కీలక పోరు వేళ ఐపీఎల్‌లో ముంబై, ఎస్ఆర్‌హెచ్ హెడ్-టు-హెడ్ రికార్డ్ ఓ పరిశీలిద్దాం. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు ఇప్పటి వరకు 25 సార్లు ముఖాముఖి తలపడ్డాయి. ఇందులో ముంబై 14 సార్లు గెలుపొందగా.. ఎస్ఆర్‌హెచ్ 10 సార్లు విజయం సాధించింది. ఒక మ్యాచ్ టై అయింది. ఈ గణాంకాలను బట్టి చూస్తే హైదరాబాద్?పై ముంబైదే పై చేయి.

**వాంఖేడే స్టేడియం పిచ్ రిపోర్ట్:-**

బుధవారం (ఏప్రిల్ 29) ముంబై ఇండియన్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ తలపడనున్న వాంఖడే స్టేడియం పిచ్ సాధారణంగా బ్యాటర్లకు అనుకూలం. ఈ పిచ్?పై భారీ స్కోర్లు నమోదయ్యే ఛాన్స్ ఉంది. ఈ స్టేడియంలో ఎక్కువగా టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ ఎంచుకుని ఆ తర్వాత లక్ష్యాన్ని ఛేధించడానికి మొగ్గు చూపుతాయి. ముంబై, హైదరాబాద్ మ్యాచ్?కు ఎలాంటి వాన ముప్పు పొంచిలేదని వాతావరణ శాఖ అంచనా వేసింది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776